# సైబరాబాద్ కథలు – II



## విషయసూచిక


1. మనోళ్ళు 3
2. మా అమ్మ 17
3. మారుతి స్టోర్స్ 32

# <u>ఒక చిన్నమాట</u>

ఈ కథల్లో నేను ప్రస్తుతం  హైదరాబాదులో బతుకుతున్న సామాన్యుల జీవితం చిత్రించాలనుకున్నాను. నా చుట్టూ ఉన్నది, నాకు తెలిసినది. ఇక్కడ కథ కన్నా ముఖ్యం వ్యక్తులు, వారి వారి ప్రవర్తన.

రెండో దఫాలో మళ్ళీ  మూడు కథలే ఉన్నాయి. ఇవి మీకు నచ్చితే ఇంకా కొన్ని పంచుకోగలను.

# 1. మనోళ్ళు

సిటీకి ఒచ్చి రెండు నెలలు అయితాంది. ఊర్ల నడిపిన కారే గాని జెర సిటీ ట్రాఫిక్ ల చెయ్యి సాఫ్ గానీకె శంకరన్నని పక్కన కూర్చోపెట్టుకొని ఆయన కార్ల రెండు రోజులు నడిపిన. అంత బానే ఉన్నది. ఒక్క దెగ్గర పనికి కుదిరే ముందు అక్కడక్కడ ఒకటి రోజు రెండు రోజులు పొయ్యే పని ఉంటే చెప్తా అన్నడు శంకరన్న.

నిన్న చేసి చెప్పిండు. కృష్ణమూర్తి సార్ అని ఉన్నడంట. వాళ్ళ పిల్లగాని పెండ్లికి ఒక రెండు వారాలు వాళ్ళతో డ్రైవర్ లెక్క ఉండమన్నడు. రోజుకి అయిదు వందల రూపాలు బత్తా. సరేనని చెప్పిన.

పొద్దున్నే ఏడింటికి లేచి, దబ దబ స్నానం చేసి సార్ వాళ్ళింటికి ఒచ్చిన. దిల్షుఖ్నగర్ కోణార్క్ థియేటర్ ఎనకాల ఇల్లు.

ఇంకా పెండ్లి సందడి లేదు ఇంట్ల. పొయ్యేసరికి ముంగట డోర్ తెరిచే ఉన్నది. సార్ కొడుకనుకుంటా. సోఫా మీన కూర్చొని ఉన్నడు. ఏదో పని మీద ఉన్నట్టున్నడు. కంప్యూటర్ పైన.

బయటనుండే పిలిచిన.

“నమస్తే సార్. నేను శీను. డ్రైవర్ను. శంకరన్న తోని రమ్మనమని చెప్పిన్రంట కృష్ణమూర్తి సార్.”

“ఓకే. లోపలి రా. కూర్చో” అన్నడు నా దిక్కు సరిగ్గా సూడకుండా.

లోపలి పోయినా. అట్లనే నిల్చున్న.

“కూర్చోవయ్యా” అన్నడు.

సార్ కూర్చున్న సోఫా ఒక్కటే ఉన్నది. చాలా ఖరీదుంటది. పక్కన ప్లాస్టిక్ కుర్చీలసుంటివి ఏమీ లేవు. ఏడ కూర్చోవాల్నో అర్థం కాలే.

ఏం అర్థం కానట్టు నా దిక్కు చూశిండు ఇప్పుడు.

“ఏం పరవాలేదు సార్. నేను బయట ఉంట.” అని చెప్తున్న. అంతలోకే లోపల్నించి కృష్ణమూర్తి సార్ ఒచ్చిండు.

“ఆ నువ్వేనా శీనువి?”

“అవును సార్.”

“మంచిగ నడుపుతవా కారు.”

“ఆ.. నడిపిస్త సార్.”

“చూడు. మొన్ననే కొడుకు అమెరికా నుండి ఒచ్చిండు. సడన్ గ పెండ్లి కుదిరింది. రెండు వారలల్ల పెండ్లి. ముందు, తరవాత ఫంక్షన్లు ఉన్నయి. పని చానా ఉన్నదీ. ఏ టైంల అంటే ఆ టైంల రావాలే. ఏ ఊరు అంటే ఆ ఊరు వోవాలె. తిండి తిప్పలు అంతా ఈడనే. మొత్తం నెల అయినంక ఒకటే సారి సెటిల్ జేస్త. ఏమంటవు?” అని ఖుల్లం ఖుల్ల చెప్పేశిండు సార్.

“సరే సార్. మీ ఇష్టం.” అన్న.

“ఇంగో బండి తాళాలు. పొయ్యి సాఫ్ చెయ్యి. ఇయ్యాలా రేపు హైదరాబాద్ అంతా తిరగాలే. పత్రికలు పంచేడిది ఉన్నది.” అని తాళాలు ఇచ్చిండు.

సరే మీ ఇష్టం  అని చెప్పి బయటికి ఒచ్చేస్తున్న.

“ఎక్కడ కూర్చోవాలో చెప్పకుండ కూర్చో కూర్చో అంటే వాడెక్కడ కూర్చుంటడు రా.” కృష్ణమూర్తి సార్ కొడుకిని అడిగిండు.

కారు కొత్తగా ఉన్నది. ఎక్కువ వాడనట్టున్నది. బకెట్ల నీళ్ళు తెచ్చి మంచిగ కడిగిన. బట్ట తెచ్చి సాఫ్ చేశ్న. ఇంతటికల్ల లోపల్నించి పిలిచిండు సార్. పొయ్యి సాటుంగ నిల్చున్న.

“చాయ్ తాగు. వోదాం పావు గంటల.” అని చెప్పి లోపలికి ఎళ్ళిపోయిండు.

పనిమనిషి ఒచ్చి చాయ్ ఇచ్చింది. చిన్న సార్ ఇంకా అక్కడే ఉన్నడు.

మేడం ఒచ్చింది.

“చూడు బాబు. నువ్వేనా డ్రైవర్ వి. సిటీల చానా జాగ్రత్తగా నడపాలే. నాకస్సలే భయ్యం. సరేనా.” అని చెప్పి. నన్ను మాట్లాడనియ్యకుండానే లోపలికి పొయ్యింది.

“ఎందుకమ్మా ఇంత కష్టం. అసలు పెళ్ళికి మనకి ఇష్టం ఉన్నోళ్ళని, ఇష్టం లేనోళ్ళని ఎందుకు పిలవాలి. వందలమందిని పిలిచి ఇంత ఖర్చు పెట్టేకన్నా మనకు కావాల్సిన వాళ్ళని పిలిచి చిన్నగా చేస్కోవచ్చు కదా.” ఏందో కొత్తగా చెప్తుండు చిన్న సార్.

మేడం ఏమీ అనలే.

“అవేం మాటలు రా. ఈ అమెరికా బుద్ధులు ఈడ పనికిరావు. పెండ్లి అంటే నలుగురు రావాలే, తినాలే, పిల్లని పిల్లగాడిని ఆశీర్వదించాలె.” సార్ పత్రికలూ తీస్కోని ఒచ్చిండు.

“కాని మనకి అస్సలు ఇంపార్టెంట్ కాని వాళ్ళు. మనకు నచ్చని వాళ్ళు కూడా. ఒచ్చి ఏం లాభం. వాళ్ళెంత దెగ్గరోళ్ళయినా కాని.”

“మనకి పడినా పడకున్నా, దెగ్గరోళ్ళు దెగ్గరోళ్ళే. అందరినీ పిలవద్దు అంటదు వీడెక్కడోడే. బజార్ల ఇజ్జత్ ఉంటదా?” సార్ పత్రికలన్నీ సంచిల పెట్టి మేడంకి ఇచ్చిండు.

“సరే పోనీలెండి. ఇంగ పోదాం పదండి. లేట్ అయితుంది. కార్ తియ్యవయ్యా.” అన్నది నన్ను చూసి.

- * *

రోడ్డెక్కినం.

“చూడు శీను. ఇయ్యాల ముఖ్యమైన చుట్టాలింట్లల్ల పంచేసెయ్యాల. ఇట్ల ఎనక నుంచి పద. ఓల్డ్ సిటీ నించి. ఆడ ఇచ్చేస్కోని మల్ల మెహదిపట్నం నించి బంజార హిల్స్ పొయ్యి అట్ల సిటీ చుట్టేసి ఒద్దాం.” అన్నడు సార్.

“సార్ ఏమనుకోకుండ్రి. నాకు సిటీల రూట్లు తెల్వయి. మొన్ననే ఒచ్చిన. మీరు చెప్పుండ్రి. ఎటంటే అటు తీస్కపోత.”

“సరే అట్లనే కాని. ఎప్పుడొచ్చినవు. ఏ ఊరు?”

“జనగాం సార్ మాది. ఒచ్చి రెండు మూడు నెలలయితాంది.”

ఆదివారం పూట. ట్రాఫిక్ జెర తక్కువ ఉన్నది రోడ్డు మీన.

ముందుగాల ఓల్డ్ సిటీ మీద పడ్డం.

పెండ్లి గురించి,వియ్యంకుల  ఖర్చుల గురించి, చిన్న సార్ గురించి మాట్లాడుకుంటున్నరు సారోళ్ళు.

“ఈడ చాంద్రాయణగుట్టల ఒక ఇల్లు ఉంది ముందు ఆడికి పోదాం.” అన్నడు సార్.

“మనమొస్తున్నట్లు ఫోన్ చేశినవానే నిన్న?” మేడంని అడిగిండు.

“ఆ చేశ్న.”

“ఏమన్నరు?”

“ఏమంటరు. ఆదివారమే కదా. ఇంట్లనే ఉంటాం రండి అన్నది.”

“ఎవరు? సునీత ఎత్తిందా? శేఖర్ లేకుండే?”

“ఉండే. కాని ఏం మాట్లాడలె.”

“ఉండక ఏం చేస్తడు. అసలు వాడు ఏం చేస్తడో నాకిప్పడికీ అర్థం కాదు. బేకార్ గాడు.”

“ఏదో ఒకటి చేసి సంసారం నడుపుతుండు కదా. తప్పయితే చేస్తలేడు.”

“అబ్బా... నడుపుతుండు. వానితో మొదలు పెట్టినోల్లు ఎక్కడున్నరు. వీడెక్కడ ఉన్నడు.” అని మధ్యల ఆపి, “శీను. ఆ ముంగట రైట్ తీస్కో. జెర ముందుకు పొయినంక చౌరస్తా ఒస్తది. అక్కడ లెఫ్ట్.” అని నాతో అని మల్ల మేడంతో “ఆ రోజొచ్చి పదివేలు తీస్కపోయిండు. ఇచ్చిండా ?” అన్నడు. జెర గట్టిగనే అన్నడు.

“లేదు.” అన్నది మేడం.

“ ఆరునెల్లాయే. పది వేలు జమ చెయ్యలేకపోయిండు. వానితో పని చేశేటోల్లకి అది గంట పని.”

“ఇస్తడు లెండి. తెల్సు కదా. వాడికేవో కొన్ని రూల్సు. దాని ప్రకారమే చేస్తడు ఏం చేసినా. పైనుంచి సునీతకి బాగుంటలేదంట ఈ మధ్య.”

“ఏహే. చేతగాని మాటలు అవన్నీ.”

ఒక రెండు నిమిషాలు మేడం ఏం మాట్లాడలె. సార్ కూడా ఊకున్నడు.

“ఇదంతా తెల్సా శీను నీకు?” అన్నడు నాతోని.

"తెల్వదు సార్."

"ఓల్డ్ సిటీ. మేము ముందు ఈడనే ఉండేది. పెరిగిందంత ఈడనే."

"అవునా సార్."

"ఆ..ఆ పక్కన ఎర్ర బిల్డింగ్ దెగ్గర ఆపు. అదే ఇల్లు. అగో పిల్లలు బయటనే ఉన్నరు."

ఉన్న చిన్న రోడ్ల ఒక పక్కకు ఆపిన. సారోళ్ళు దిగి ఎల్లిపోయిన్రు.

ఒక పది ఇరవై నిమిషాలు ఐతదని అన్నరు. సరే ఆని అట్ల పక్క గల్లీలకి పోయిన. మూత్రం పొయ్యి, పక్కన కేఫ్ ఉంటే ఒక చాయ్ తీస్కున్న.

జేరాగి బండి దేగ్గరికి పోయిన. అప్పటికే సార్ వాళ్ళు బయటికి ఒచ్చి నాకోసం చూస్తున్నరు.

"ఏడికి పోయినవ్? నీ నెంబర్ కూడ లేదు మా దెగ్గర?" కోపంగా ఉన్నడు సార్. పక్కన మేడం కూడ అట్లనే ఉంది. ఆ ఇంటోల్లనుకుంట, వాళ్ళు కూడ బయటికి ఒచ్చి నిలబడ్డరు.

"మీకు పది నిమిషాలు ఐతదన్నరు కదా అని చాయ్ తాగుదాం అని పోయిన సార్"

"తరవాత పోతం కదా. ఎక్కడన్న ఉండమంటే ఆడనే ఉండాలే. అర్థం అయ్యిందా. బండి రివర్స్ చేస్కో తొందరగా." అన్నడు.

ఆ ఉన్న ఇంత గల్లీల రివర్స్ చేస్కునుడు కష్టమే. అట్లనే ముందు గల్లీకి పోదామా అని అడుగుదామనుకున్నా. ఎందుకులే అని అటు జేశి ఇటు జేశి యు గొట్టిన.

కార్ ఎక్కినంక సప్పుడు జెయ్యక కూసున్నరు.

"ఎంతయినా కావల్సిన వాళ్ళు. అట్ల పెళ్ళి పిలుపుకి ఒచ్చి కోపంగా వెళ్ళిపోతే వాళ్ళకి ఎట్లుంటది." అన్నది మేడం. గొంతు జీరబోతుంది.

"రాదా మల్ల. అయినా నన్నంటవేంది. శేఖర్ గాడు అట్ల మాట్లాడుడు బాగుందా? నా ముంగట పుట్టినోడు. నాతోని మాట్లాడే పద్ధతి తెలుసా వానికి."

"ఏదో చిన్నప్పటినించి చూస్తున్నరు కదా. ఆడికి నేను, సునీత పోనియ్యండి అంటనే ఉన్నం."

“ఎందుకు పోనియ్యాలే? నన్ను సూటి పోటి మాటలంటే. నేను పైసా కోసం ఒప్పుకున్నానా ఈ సంబంధానికి. ఎవడు చెప్పిండు వానికి. ఏదో పిల్లోడు అమెరికాల ఉంటడు. అమ్మాయి మంచిది, నచ్చింది అన్నడు అని నేను ఆలోచిస్తుంటే.”

“వాడట్ల అనలేదంటే. వాని సంగతి తెల్సు కదా. డొంక తిరుగుడు మాటలు రావు వానికి. మంచిగా సెటిల్ అయిన ఫ్యామిలీ కదా అన్నడు అమ్మాయి వాళ్ళది. అంతే.”

“ఊకోపే. నాకు తెల్వదా. పైసాకి గతిలేదు కాని పొగరుకి మాత్రం తక్కువ లేదు.”

- * *

ఓల్డ్ సిటీల ఇంక ఒకటి రెండు ఇండ్లల్ల తొందరగా పత్రికలు పంచేశిన్రు.

ఆడికి మధ్యాహ్నం అయ్యింది.

“ఈడినించి మెహదిపట్నం పోవాలె. నేను చూపిస్తా పదా. అక్కడ ఒక్క ఇంట్ల చెప్పినంక ఎక్కడన్నా తిందాం.” అన్నడు సార్.

“ఇక్కడన్న ఏమనకున్రి.

జూపార్క్, జియా గుడా మీదంగ మెహదిపట్నం పోయినం. పొయ్యేసరికే గంట అయ్యింది.

మంచి ఏరియా లాగానే ఉన్నది. విజయ్ నగర్ కాలనీ అంట. సార్ వాళ్ళ చుట్టలోల్ల ఇల్లు కూడ బాగున్నది

చెట్టు కింద పెట్టిన బండి. ఎండ ఉంది కాని చెట్టు గాలి సల్లగ కొడుతుంది. అద్దం కిందకి దించి ఒరిగిన. ఆకలయితుంది. కాని కన్ను మలిగింది.

“ఏయ్ శీను. లెవ్వు.” అరిచిండు సార్.

ఒక్కసారి లేశి సీట్ సక్కగా చేశ్న. కార్ స్టార్ట్ చేసి పక్కకి తీస్తున్న.

ఎంత సేపయ్యిందో. అయిన పండుకుంటే ఇంత కోపం ఐతుండు ఎందుకో.

“చెట్టు కింద పెట్టేటప్పుడు చూస్కోవద్దారా? నువ్వు పన్నవు. పిట్టలన్ని కారు ఖరాబ్ చేసినయి. ఇట్లనే తిరగాల్నా ఇయ్యాలంత?”

ఈ డ్రైవర్ పనిల ఇదే లొల్లి. బయట ఏదో అయితది. అదే మనసుల పెట్టుకొని కార్ ఎక్కుతరు. అది మనపైన తీస్తరు. ఆ కోపం మన మీద అని అనుకోవద్దు అని జెప్పిండు శంకరన్న. అదేనేమో ఇది గూడ.

కాని నిజమే.. పైన రెట్టలు పడ్డయి.

"ఒక్క రెండు నిమిషాలల్ల తుడిచేస్త సార్."

ఇనిపించుకోలె సార్. ఎక్కి డోర్ పెట్టుకున్రు. బయటికి ఒచ్చిన ఇంట్లోల్లకి టాటా చెప్తుంది మేడం. సార్ మాత్రం అటు దిక్కు చూస్తలేడు.

గల్లీ దాటింది.

"అన్ని సార్లు తినమంటే అంత ఖచ్చితంగా ఒద్దు అంటరేందండి. ఒక లాగ పెట్టిన్రు వాళ్ళు మొఖం." అడిగింది మేడం.

"నాకు తినబుద్ధి కాలే ఆడ."

మల్ల ఏదో అయ్యింది ఈ ఇంట్ల కూడా సార్ కి అనుకున్న.

"అదే ఏమయ్యింది. వీళ్ళేమన్నరు మల్ల."

"అంటే ఇందే నేనే అందరితో గొడవలు పెట్టుకుంటనా. నాకేం పట్టింది."

"అట్ల కాదండి. నేను వంటింట్ల ఉంటిని. బయట మీరు మొగోల్ల మధ్యన ఏమన్న మాటొచ్చిందా అని."

"ఏముంటది. ఇట్లనే. వాడి సంగతి తెల్సు కదా. వాని కొడుకు గురించి గొప్పలు చెప్తుంటడు."

"చెప్పుకోనియ్యండి వాడి కొడుకు వాడిష్టం. మనకేంది."

"పిచ్చి దాన. నీకేం తెల్వదు. మనోడు కూడా వాని తోటోడే కద. ప్రతి విషయంల వాని కొడుకే గొప్ప అని చెప్పుకోవాలె అని తాపత్రయం."

"ఇప్పుడేమన్నడు." బాటిల్ తీసి సార్ కి నీళ్ళు ఇచ్చింది మేడం.

"ఏమంటడు. వాని కొడుకు ఇట్ల చెయ్యడంట. ఎవ్వరిని చూపిస్తే వాళ్ళని చేస్కుంటదంట. మొన్న ఫోన్ ల చెప్పిందంట. మీరెవ్వరినంటే వాళ్ళని చూడండి డాడీ. ముహూర్తం పెట్టి చెప్తే టికెట్ చూస్కొని పెళ్ళి చేస్కొని

ఎల్లిపోతడంట. మనోడు ఏదో తప్పు చేసినట్టు. ఇదే వాని కొడుకు లవ్ మ్యారేజ్ చేస్కోని ఉంటే వాడు అదే గొప్ప అనేటోడు."

"మనోడు మాత్రం ఏం చేశిండు. మనం ఒప్పుకుంటేనే కదా పెళ్ళి చేసుకుంటుండు." అన్నది మేడం. కొడుకుని అంటే మేడం కి కూడా కోపం ఒచ్చినట్టుంది.

"అదంతా వానికేందుకే. ఏదో మాట అనాలే. మనోనికంటే వాని కొడుకు గొప్ప అని చూపించుకోవాలే. అయినా వాడెంత హౌలే గాడే! ఈ కాలంల, అమెరికాల ఉండుకుంట, పిల్లని చూడకుంట చేస్కుంట అనేటోడు."

మేడం ఏమనలే.

"అసలు మనం వాణ్ణి కాని వాని కొడుకుని గాని ఎప్పుడన్న ఏమన్న అన్నమా? అసలు వాని గురించే ఆలోచించం మనం. వాడే ఎప్పుడు మనోనితో కంపేర్ చేస్కుంటడు. ఏదో ఒకటి అంటడు. అందుకే అనేది మనిషికి కుళ్ళు ఉండొద్దు అని. మనం ఎంత సుఖంగా ఉన్నా పక్కనోడిని సూడబుద్దేస్తది."

"సరే లెండి. ఆకలయితుంది. ఎక్కడన్న ఆపమని చెప్పండి." అన్నది మేడం.

హమ్మయ్య అనుకున్న నేను.

"ఏం శీను తిందామా ఎక్కడన్నా?" అడిగిండు సార్.

"మీ ఇష్టం సార్."

"చికెన్ మటన్ తింటవు కదా?"

"ఆ తింట సార్."

"అయితే ఒక్క పని చెయ్యి. ఆ ముంగట పొయినంక మాసబ్ ట్యాంక్ ఫ్లైఓవర్ ఒస్తది. దాని కింద నుంచి లెఫ్ట్ తీస్కో. ముంగట పొయినంక ఎక్కడన్న ఆపు. సరేనా?"

"సరే సార్."

ఈ ఒక్క సిగ్నల్ దాతనీకే అర్ధ గంట అయ్యింది. మొత్తానికి పోయినం.

ఒక హోటల్ కాడ ఆగినం. ఇట్ల బైటికి పోయినప్పుడు మధ్యాహ్నం అన్నం తినొద్దు అన్నడు శంకరన్న. నిద్ర ఒస్తది అని. అందుకనే చపాతీలు తిన్న. సారోళ్ళు లోపల తిన్నరు.

జల్ది జల్ది తినేశి కొన్ని నీళ్ళు తీస్కోని కార్ పైన పడిన రెట్టలు తుడిచేశ్న.

నిద్ర ఒస్తదని జెర అటు ఇటు తిరిగిన. సారోళ్ళు మెల్లగ ఒచ్చిన్రు.

- * *

మల్ల రోడ్డెక్కినం. ఆడ ఆడనే సారోల్ల దోస్తుల ఇండ్లు ఉన్నాయంట. అవన్నీ తిరిగేటప్పటికి ఏడు కొడ్తుంది. పొద్దున్నించి తిరిగిన్రు కదా సారోళ్ళు కూడా అలిసిపోయిన్రు. నేను గూడ.

“ఇంక పోదాం పదండి. మల్ల రేపు చూస్కుందాం.” అన్నది మేడం.

“సరే. ఇంత దూరం ఒచ్చినం కదా. మల్ల రేపెల్లుండి ఇటు సైడు రామేమో. ఒక్కసారి మీ వెంకటేశ్వరావు అన్నోల్లని కనుక్కో. ఇంట్ల ఉన్నారో లేదో. అసలే వాళ్ళకి టైం ఉండదు.” అన్నడు సార్.

“వాళ్ళు లేకుంటే ఏందీ. ఇంటి నిండ పనోళ్ళు. కార్డు ఇచ్చేసి ఒచ్చేద్దాం. ఊకే వాళ్ళని ఇంట్ల ఉన్నావా అని అడిగి ఇబ్బంది పెట్టుడు ఎందుకు.” విసుక్కుంది మేడం.

“లే. ఉన్నప్పుడే పోదాం. ఒకసారి కలుద్దాం. మీ అన్న తో మాట్లాడ్తా. ఎమన్నా కొత్త బిజినెస్ ఎమన్నా పెట్టిండేమో తెలుస్తది. నాలుగు విషయాలు తెలుస్తయి.”

“ఆ అన్న. మా సొంత అన్నదమ్ములతో మాట్లాడరు కాని పెదనాయన కొడుకుతోని ఏముంది?”

“వీళ్ళంటే పనికిరానోళ్ళు. కాని ఈయన వేరే కదా. ఓసారి ఫోన్ కొట్టి చూడు. ఇంట్ల ఉన్నరేమో.”

మేడం ఫోన్ చేశింది.

“ఆ అన్నయ్యా. బాగున్నరా... అవునన్నయ్యా... మొన్ననే ఒచ్చిండు అమెరికానించి. అదే పెండ్లి కుదిరింది. మీరు ఇంట్ల ఉన్నారేమో అని... ఆ మంచిదన్నయ్యా.... ఇక్కడనే ఉన్నం జెర సేపట్ల ఒస్తం.”

“ఉన్నారంట. పాండి పోదాం మరి.”

“చూశ్నవా. అనవసరంగ మిస్ అయితుండే.......చలో శీను. బంజారాహిల్స్ పోనీ... ఇందాక ఫ్లైఓవర్ కిందనించి ఒచ్చినం కదా. అక్కడినించే...”

“వేరే రూట్ ఏం లేదా సార్. ఆడ చానా ట్రాఫిక్ ఉంది.” అన్న మెల్లగా.

“లేదు. ఎటునుంచి పోయినా అట్లనే ఉంటది పదా.” పొద్దున్నించి ఇప్పుడే సార్ జోష్ మీద ఉన్నడు.

“అయ్యో పాపం. అలిసిపోయినట్టున్నడండి.. పొద్దున్నించి తిప్పుతున్నం.” మేడంకి ఒక్కదానికే అర్థం అయ్యింది నా బాధ.

“ఏహే. వాళ్ళు డ్రైవర్లు.. అలవాటే ఉంటది.” నవ్విండు సార్.

నేను కూడా నవ్విన కొంచెం..

“పైనించి మన శీను ఊర్ల పుట్టి పెరిగినోడు. గట్టోడు... “ ఎనకనించి నా భుజాలు పట్టిండు.

అందరం నవ్వినం.

ఈడినించి ఈడకు పోయినట్టే ఉంది. దానికే అర్ధ గంట పట్టింది. బంజారాహిల్స్ ఒచ్చినంక జెర తగ్గింది. కాని లోపల ఎక్కడనో ఉన్నది ఇల్లు. పెద్ద పెద్ద రోడ్లు. దూరంగ దూరంగ ఇండ్లు.  కాని మస్తున్నయి.

తప్పిపొయ్యేటట్టే ఉన్నయి రోడ్లు. అన్ని ఒకటే లెక్క.

ఒక పెద్దింటి ముందుకు ఆగినం. ముంగట గేటు దెగ్గర వాచ్ మాన్ కి చెప్పిండు సార్. ఇట్ల లోపలి పోవాలె అని. ఆయన లోపల ఓల్లకి కనుక్కొని గేటు తీశిండు.

ఇంటి ముంగట జాగా. ఆడనే కారు పెట్టినం. సార్ వాళ్ళు దిగి లోపలి పోయిన్రు. ఈ ట్రాఫిక్ ల బేజార్ ఒచ్చింది. కాళ్ళు గుంజుతున్నయి. నేను కూడా దిగి అటు ఇటు నడుస్తున్న. సిగరెట్ ముట్టించ బుద్ధయ్యింది. ఇక్కడెందుకులే అని గేటు బయటికి పోతున్న..

“బాబు. డ్రైవర్..”

ఇంట్ల పనాయిన లాగుండు.

“నువ్వేనా కృష్ణమూర్తి సారోల్లతో ఒచ్చింది?”

“అవును.”

“మరి అట్ల పోతున్నవు? తిందువు దాలోపలికి.” అని తీస్కపొయ్యిండు.

ఎనకనించి ఇంట్లకి తీస్కపోయిండు. లోపల మంచిగ చికెన్ కూరతోటి అన్నం పెట్టినరు. తినొద్దనుకున్న కాని తినేశ్న. కడుపునిండా…హాయిగా ఉండే.

సల్లగ గాలికి బయిటికి ఒచ్చి ఒక సిగరెట్ ముట్టించిన. కార్ అద్దాలు దించి కూర్చున్న.

కొంచెం సేపాగి సారోళ్ళు ఒచ్చిన్రు.

“చలో శీను. ఇంక ఇంటికే. ఏడికి లేదు.” అనుకుంట ఎక్కిండు సార్.

“అవును. పొద్దున్నించి ఎండలో తిరిగినం. నాకు ఓపిక లేదు ఇంకా.” నిద్రొస్తున్న గొంతుతో అన్నది మేడం.

దెగ్గర దెగ్గర పది ఐతుంది. ట్రాఫిక్ తగ్గుతుంది. తినేది లేకుండే. నిద్ర ఒస్తుంది బాగా. రేడియో పెట్టిన. సార్ సౌండ్ తగ్గియ్యమన్నడు.

“మీ అన్న ఏదో సాఫ్ట్వేర్ ల పైసలు పెడుతుండంట.”

“అవునా.” నిద్రల అన్నది మేడం.

“అడిగితే సక్కగా చెప్పలేదు. మనోడు కూడా చిన్న కంపెనీ పెట్టుకున్న అన్నడు కదా అమెరికాలో. ఎమన్నా హెల్ప్ ఐతదేమో అని అడుగుతుంటే..” ఈసారి కోపం లేదు సార్ గొంతులో..

“హ్మ్.. అడిగితే.. చెయ్యనన్నడా?”

“అసలేమన్న చెప్తే కదా. నేనెన్ని సార్లు మాట తీసినా మార్చేస్తుండు.”

మేడం ఏం అనలే.

“అమెరికాలనే ఏదో ప్రాజెక్ట్ అంట. చెయ్యడానికి మనుషులు వెతుకుతున్నం అదీ ఇదీ అన్నడు. మనోడు అదే చేస్తున్నడు. మనుషులు ఉన్నరు ఇవన్న ప్రాజెక్ట్లు ఎతుకుతున్నడు అన్జెప్పిన.”

“హ్మ్.”

“అసలు మాట వరసకైనా ఎవరు ఏంది అనో.. సరే చూస్త అనో చెప్పాలె.”

మేడం పడుకుంది.

“ఎవడన్న ఎదిగితే మనోళ్ళకి సాయం చెయ్యాలని చూడాలి శీను. కాని ఈ చుట్టాలున్నరు చూశ్నవా! ఎవడో మనకి తెల్వనోనికో, జీవితంలో ఎప్పుడు చూడనోనికో చేస్తరు.. పొరపాటున మనకి చేస్తే ఎక్కడ మనం ఎదిగిపోతమో అని భయం.”

మేడం పడుకుంది అని నాకు చెప్పుడు షురు చేశిండు సార్. నేనుట్టిగా ఇంటున్న. అసలే నిద్రొస్తుంది.

“అయినా వీళ్ళు పుట్టినప్పటినించే ఇంత పెద్దోళ్ళు ఏం కారు. మంచి సంబంధం దొరికింది. అత్తగారి ఆస్తి కలిసొచ్చింది. వాళ్ళ దోస్తులని కలుపుకొని ఏదో బిజినెస్ పెట్టిండు. అంతే దశ తిరిగిపోయింది. ఇప్పుడు చూడు.”

నాకేం అనాలో అర్థం కాలే. “అవును సార్. ఇల్లు చానా బాగున్నది.”

“అబ్బా. పోనీ లెండి. మీరేమన్నరో ఆయన ఏమిన్నాడో.” మేడం లేచే ఉంది.

“సరే ఇప్పటి ముచ్చట కాదు కదా. మనం ఎన్ని సార్లు ఏదన్న చేద్దాం అన్నా పెద్ద పట్టించుకోడు. సరే ఎవరికుండేది వాళ్లకుంటది. ఎల్లకాలం అందరు ఒకటే లాగ ఉండరు కదా.”

ఇంక ఏదో మాట్లాడుతుండు సార్. నేను పట్టించుకోలే. జాగ్రత్తగా నడుపుతున్న బండి.

కొంచం సేపటికి ఇద్దరు నిద్రపోయిన్రు. అబిడ్స్ దాంక ఒచ్చేశ్నం కాబట్టి నాకు రాస్తా తెల్సు.

బ్యాంకు స్ట్రీట్ దెగ్గర వన్ వే మీద పోతున్న. ముంగట బస్సోడు మెల్లగ పోతుండు. తిక్క లేశి ఓవర్ టేక్ చేద్దామని రైట్ సైడుకు కొట్టిన. ఒక్కసారిగా అవుతల నుంచి అప్పర్ లైట్లు ఎస్కోని బండి ఒచ్చుడు చూశ్న. సడన్ బ్రేక్ కొట్టిన...సరిపోదు..బండి రైట్ కు తిప్పినా... అయినా ఆ కారొచ్చి మా ఎనక డోర్ కి కొట్టింది. అటు సైడ్ సార్ కూర్చుండు. కారు గుద్దగానే గట్టిగా అరిసిండు.డోర్ లోపలికి ఒచ్చి కాలుకి కొట్టింది అని తరవాత తెలిసింది.

- * *

సార్ హాస్పిటల్ల ఉన్నడని చూద్దామని పోయిన మరుసటి రోజు. కాలు ఫ్రాక్చర్ అయ్యిందంట. నాకు చానా బాధగా అనిపించింది. అసలే పెండ్లిల్లు. ఎమన్నా అయితే... అమ్మో ఆలోచించనీకెనే భయం అయితుంది.

నేను పొయ్యేటప్పటికే సార్ వాళ్ళ చుట్టాలందరూ ఉన్నరు. మొన్న ఓల్డ్ సిటీలోళ్ళు, మెహదిపట్నంవాళ్ళు , బంజర హిల్స్ డబ్బున్నోళ్ళు అందరు ఉన్నరు. వాళ్ళు వెళ్ళే దాక ఆగుదాం అని బయటనే ఉన్న.

“ఏం చేస్తం లే బావా. అదృష్టం ఏందంటే పెద్ద దెబ్బలేం తగలలే. ఫ్రాక్చర్ తో సరిపోయింది. అదే ఇంకేమన్నయ్యుంటే..అమ్మో”

“అసలు ఆ కొత్త డ్రైవర్ని ఎందుకు పెట్టుకున్నరు. చెప్పుంటే నేనే ఎవరినన్నా పంపిస్తుండే కదా.”

“ఇంట్ల పెట్టుకొని ఇట్ల అయితే ఎట్లనో. ఇప్పుడేం చెయ్యాలే?” మేడం గొంతు గుర్తుపట్టిన.

“అదేందక్కా. అంత మాటంటవు. మేమందరం లేనప్పుడు ఆ మాట అనాలే. ఎట్లైనా రేపో ఎల్లుండో మేమే ఒచ్చి పెండ్లి పనులు చూస్కునేటోళ్ళం. ఇప్పుడు ఏం అయ్యిందని. రెండు రోజులల్ల లేస్తడు బావ. మేము చూస్కుంటం కదా. నువ్వేం పరేషాన్ గాకు.”

ఇంకా జెర సేపుండి. చుట్టాలందరూ వెళ్ళిపోయిన్రు. లోపలి పోదాం అనుకున్న. ఇంకపేరన్న ఉన్నారేమో అని ఆగిన.

లోపల్నించి సార్ గొంతు ఇనపడ్డది.

“చూశ్నవానే.. అందరు ఒక్కసారి ఒచ్చి నేనున్న, నేనున్న అని ముందు నిలబడ్డరు. సరే ఏదో మధ్య మధ్యల దూరమైనా.. ఎంతైనా మనోళ్ళు మనోళ్ళే.”

“అవునండి. ఎన్నేండ్లాయే...ఇట్ల అందరం మంచిగ మాట్లాడుకొని... ఎమన్నా అనుకున్నా చేశ్నా.... మల్ల కష్టం ఒచ్చిందంటే ఎవ్వరు ఎనకాడరు. మంచిగ పెండ్లిలనే కలుస్తుండే. ఆ డ్రైవర్ గాని వల్ల ఈ హాస్పిటల్ల పడాల్సి ఒచ్చింది.”

ఇంకా ఎదో మాట్లాడుకుంటున్నరు. నాకింక అప్పుడు వాళ్ళని కలవబుద్ది కాలే. అక్కణ్ణించి ఒచ్చేశ్న.

ఆ టైంల లోపలికి పోబుద్ధి కాలే. ఒచ్చేశ్న.

- * *

ఒక వారం రోజులాగి సార్ ఇంటికొచ్చిండు అని తెలిసింది. సరే తిడితే తిట్టిన్రులే ఒక్కసారన్న కలవాలే అని ఇంటికి పొయిన.

సార్ కాలుకు పట్టీ ఉంది. కట్టె పట్టుకొని నడుస్తుండు. గుండెల కలుక్ అన్నది చూడంగనే. సార్ మంచోడు. ఒక్క మాట కూడా అనలే.

"పోనీ లేరా.. నువ్వేమన్నా కావాలని చేశ్నవా. అవుతలి సైడు నుంచి వాడొస్తే నువ్వేం చేస్తవు." అని ఆ ముచ్చట ఈ ముచ్చట మాట్లాడిండు. మనసు అల్కగ అనిపించింది.

జెర సేపు  ఉండి ఒచ్చేస్తుంటే మల్ల పిలిచిండు సార్.

"శీను. రేపు ఒకసారి రా. పనుంది. మేడం ని బాబుని బయటికి తీస్కపోవాలి." అన్నడు.

సరే అని పోతున్న. అంతల  మేడంతో  అంటుండు సార్ "మొన్న హాస్పిటల్ కి ఒచ్చినప్పుడు ఒకొక్కడు ఎంత మాట్లాడిండు. మేమే చూస్కుంటం అంత. అసలు మీరు అక్షింతలు ఇస్తే చాలు అది ఇది అని. ఇప్పుడేరి? మనమే ఫోన్ చేశి అడుక్కోవాలే. అది చేశి పెట్టున్రి ఇది చేశి పెట్టున్రి అని....సరే ఏం చేస్తం."

- * *

# 2. మా అమ్మ

“మా అమ్మంటే నాకు చాలా ఇష్టం. చెప్పడానికి కొంచం టూ ముచ్ గా ఉంటుంది కాని మా అమ్మంటే నాకు దేవతే. అంటే ఎవరికైనా వాళ్ళ అమ్మ అలాగే అనిపిస్తుంది. కాని నా విషయంలో ఇది నిజంగా నిజం అనిపిస్తుంది నాకు.”

ఇలాంటి మాటలు నేనెప్పుడూ ఎవరితో మాట్లాడలేదు. కాని కొన్ని రోజుల నుంచి ప్రీతి చాలా దగ్గరయ్యింది. తనతో అన్ని విషయాలు షేర్ చేసుకోబుద్ధి అవుతుంది. తను గురించి కూడా చాలా తెలిసింది. ఇద్దరం ఇంటికి దూరంగా ఉండటమో మరింకేంటో తెలియదు కాని ఒకరంటే ఒకరికి చాలా ఇష్టం. గంటలు గంటలు ఫోన్ లో గడిచిపోతుంది.

నా పేరు భార్గవ్. సెవెంత్ క్లాసు నుంచీ ఈ ఊళ్ళో హాస్టల్ కి ఒచ్చాము నేను, మా తమ్ముడు. టెన్త్ క్లాసు వరకు పూర్తిగా బాయ్స్ స్కూల్ అండ్ హాస్టల్ కవడంతో అమ్మాయిలతో అస్సలు పరిచయం లేదు. ఎలా మాట్లాడాలో కూడా తెలియదు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ కి ఒచ్చాక ట్యూషన్ దెగ్గర ప్రీతి పరిచయం అయ్యింది. ముందు తనతో మాట్లాడాలని చాలా కోరికగా ఉండేది కాని దేగ్గరికెళ్తే నోరు పెగలేది కాదు. కాని ఒక కామన్ ఫ్రెండ్, శివగాడు, వాడి వల్ల రెండు మూడు సార్లు కలిశాం. ఎలాగో అలాగ ధైర్యం చేసి పలకరించాను. తను చాలా కూల్. అందరినీ చాలా ఆప్యాయంగా పలకరిస్తుంది. ఎప్పుడూ నవ్వుతూ ఉంటుంది. హ్యాపీగా ఉంటుంది. నాకు ఉన్న సిగ్గు, భయం తనకు లేవు. అందరం కలిసినప్పుడు తనే  సెంటర్ అఫ్ అట్రాక్షన్. అందరు తన చుట్టూ చేరతారు. దీనికి కారణం తను అందంగా ఉండటమే అంటాడు శివగడు. కాని అదొక్కటే కాదు, తన ఎప్పుడూ హ్యాపీగా ఉండటం అని నేను అంటాను. ప్రీతి చిరాకు పడడం కాని, విసుగ్గా ఉండడం కాని చాలా తక్కువ. అందరూ ఉన్నప్పుడు మాత్రం అసలు అలా ఉండదు. అందరినీ నవ్విస్తూ ఉంటుంది. ఎప్పుడైనా మేమిద్దరమే ఉన్నప్పుడు, లేదా నాతో ఫోనులో ఉన్నప్పుడు మాత్రం ఏదైనా నచ్చని విషయం ఉంటె చెప్తుంది.

అంటే తన లైఫ్ కూడా అంత సింపుల్ గా, ఏ బాధ లేకుండా ఉంటుంది కాబట్టి ప్రీతి అలా ఉండగలుగుతుందేమో. ఎప్పుడూ కష్టం అనే మాట తెలియదు పాపం. అమాయకురాలు. తనలో నన్ను అట్రాక్ట్ చేసేది అదే. కాని నాకు అర్ధం కానిది ఏంటంటే తనకు నాలో ఏం నచ్చిందో అని. ఎప్పుడు అడిగినా మాట దాటేస్తుంది కాని చెప్పదు. నేను పెద్దగా కష్టపడలేదు కాని కష్టం అంటే ఏంటో తెలుసు.

 మా కష్టం అంతా కూడా మా అమ్మ పడుతుంది. అసలు మేమున్న పరిస్థితికి, మా ఫ్యామిలీకి, నేను, చిన్ను..అదే  మా తమ్ముడు ఇంత మంచి స్కూల్లో చదువుకుంటున్నాం అన్నా, ఇంత మంచి హాస్టల్లో ఉంటున్నాం అన్నా అదంతా మా అమ్మ గొప్పతనమే.

అందుకే ప్రీతి నా గురించి చెప్పమని బలవంతం చేసినప్పుడు నేను చెప్పిన మొదటి మాట ఇదే.

"కరెక్టే బాబూ. ఒప్పుకుంటున్నాను. మీ అమ్మ దేవతే. కాదంటే కొట్టు. కాని వేరే కూడా చెప్పు. ఎప్పుడూ ఇదొక్క ముక్క చెప్పి ఊరుకుంటావు. మీ నాన్న గురించి, వేరే ఫ్యామిలీ గురించి."
గట్టిగా అడుగుతుంది ఇవ్వాళ.

నాకంత ఇష్టం లేకపోయినా తప్పదు.

హ్మ్... మా ఫ్యామిలీ గురించి చెప్పాలంటే...

- * *

మాది చిన్న ఫ్యామిలీ. అమ్మా, నాన్న, నేను తమ్ముడు. హైదరాబాదులో ఒక లోయర్ మిడిల్ క్లాసు అనుకోవచ్చు. నాన్నది ఒక ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్ జాబ్. అమ్మ ఇంట్లోనే. నేను నాన్న చిన్ను ఒక టీం. అమ్మ ఎప్పుడూ ఒంటరిగానే మా అందరితో గొడవ పాడేది. పాపం అనిపించేది అప్పుడప్పుడూ. కాని నాన్నని కాదని అమ్మ పార్టీలో చేరటం మా వాళ్ల అయ్యేది కూడా కాదు. అయినా అమ్మకు ఎవ్వరి సహాయం అవసరం లేదు. అమ్మకి కోపం ఒచ్చిందంటే మాతో పాటు నాన్న కూడా భయపడతాడు. అందుకే మా చదువు విషయాలు, ఇంటి విషయాలు అన్నీ అమ్మే చూసుకుంటుంది. నాన్నతో ఓన్లీ సినిమాలు, షికార్లు అలాంటివి. ఒక్కరోజు కూడా నాన్న మమ్మల్ని తిట్టింది నాకు గుర్తులేదు.

అమ్మ అందరినీ చూస్కోవాలి కాబట్టి అలా పైకి అలా కోపంగా కనపడుతుంది కాని మేమంటే చాలా ప్రేమ. ఒకసారి ఏమైందో తెల్సా. మా నాన్నకి హై ఫీవర్ ఒచ్చింది. రెండు రోజులు లేవలేదు. అప్పుడు నేను సిక్స్త్ క్లాసులో ఉన్నా. ఆ రెండు రోజులు మా అమ్మ కళ్ళు మూయడం నేను చూడలేదు. తినడం కూడా చూడలేదు. రెండు రోజులు నాన్న పక్కనే కూర్చుంది. కదల్లేదు అక్కణ్ణుంచి. మా తిండి విషయం, స్కూలు విషయం కూడా పట్టించుకోలేదు. మాకు చుట్టాలేవ్వరు కూడా పెద్దగా లేరు. సో అమ్మ ఒక్కతే కష్టపడవలసి వచ్చింది.

అమ్మ సైడ్ వాళ్ళు ఎవరూ ఎప్పుడూ రావడం చూడలేదు నేను. వాళ్ళది హైదరాబాదు కూడా కాదు. అమ్మా నాన్నది లవ్ మ్యారేజ్ అంట. అందుకేనంట. నాన్నకి ఒక అక్కయ్య ఉండేవారంట. వాళ్ళెక్కడో నార్త్ ఇండియాలో సెటిల్ అయ్యారంట. ఏం చేసినా, ఏలా ఉన్నా మాకు మేమే. అందుకే అప్పుడప్పుడూ ఇబ్బంది అనిపించేది.

నాన్నకి ఇద్దరు ముగ్గురు ఫ్రెండ్స్. చాలా క్లోజ్. ఏదైనా అడగాలంటే నాన్న వాళ్ళనే అడిగేవారు. చలపతిరావు అంకుల్, చంద్రం అంకుల్. వీళ్ళు ఇంటికి బాగా ఒచ్చేవారు. మాతో కూడా సరదాగా మాట్లాడేవారు.

ఒకసారి ఇలాగే నాన్నకి ఒంట్లో బాగుండలేదు. రెండు రోజులు ఆగి నాన్నను హాస్పిటల్ కి తీస్కెళ్ళారు. అప్పుడు మేము చలపతిరావు అంకుల్ వాళ్ళింట్లోనే ఉన్నాం. అక్కడినించే స్కూలుకి. నాన్నకి ఏదో ఇన్ఫెక్షన్ అయ్యిందని కొన్ని రోజుల్లో తగ్గిపోతుందని చెప్పారు.

ఇంటికొచ్చాక ఒక రోజు స్కూలు నించి ఒచ్చేసరికి అందరూ ఉన్నారు. అమ్మ ఏడుస్తుంది. నాన్న అమ్మనీ ఓదారుస్తున్నారు. చలపతిరావు అంకుల్, చంద్రం అంకుల్ వాళ్ళ ఫ్యామిలీ కూడా ఉన్నారు.. మమ్మల్ని చూసి లోపలి తీస్కెళ్ళారు. అమ్మా నాన్నకి  మేము ఒచ్చినట్టు కూడా తెలియదు. మమ్మల్ని  లోపలే ఉండమన్నారు.

కాసేపు ఆగి అమ్మ నన్ను పిలిచింది. నాన్న తన ఒళ్లో కూర్చోపెట్టుకున్నారు. ఏదో జరిగింది అని అర్ధం అయ్యింది కాని ఏం జరిగిందో ఊహించే ధైర్యం లేదు నాకు.

“చూడు నాన్న. తమ్ముడు ఇంకా చాలా చిన్నోడు. వాడికేం అర్ధం కాదు. సో నువ్వే వాడిని, అమ్మని జాగ్రత్తగా చూస్కోవాలి. సరేనా?” అన్నారు నాన్న. ఆయన కళ్ళల్లో నీళ్ళు.

“ఇప్పుడేమైంది నాన్నా? నాకు చాలా భయంగా ఉంది.”

అమ్మ ఇంకా గట్టిగా ఏడుస్తుంది.

“ఏం కాలేదు రా. కాని రేపేమన్నా జరగొచ్చు. అందుకు చెప్తున్నా.” అని సర్దడానికి చూసారు నాన్న.

అంత చలపతిరావు అంకుల్ ఆపారు. నాన్నను.

"అరేయ్. అసలే వాడు చిన్న కుర్రాడు. ఇలా భయపెట్టకండి వాడిని. అయినా డాక్టర్ ఏం చెప్పాడు. ఇప్పట్లో ప్రమాదం ఏమీ లేదని చెప్పాడు కదా." అన్నారు.

"అయినా పిల్లలతో ఈ రోజుల్లో ఇలాంటి విషయాలు దాచకూడదు." అని నన్ను లేపి తనవైపుకు తిప్పుకొని, "చూడు భార్గవ్. నాన్నకు ఆరోగ్యం బాగా ఉండటం లేదు అని నీకు తెలుసు కదా. ఇవ్వాళే డాక్టర్ గారు చెప్పారు. నాన్నకి కాన్సర్ ఒచ్చిందట. ఇప్పుడేం భయం లేదు. కాని మనం జాగ్రత్తగా ఉండాలి. నాన్నకి ట్రీట్మెంట్ చేయించాలి. నువ్వు పెద్దవాడివి కాబట్టి నీకు చెప్తున్నాం. అమ్మని, నాన్ననీ జాగ్రత్తగా చూస్కోవాలి." అని నా చెంప మీద నిమిరారు అంకుల్.

నాకేం అర్థం కాలేదు. అమ్మ ఏడుపు తప్ప ఏమీ వినిపించలేదు. ఆ వయసులో నాకు కాన్సర్ వల్ల ఏమవుతుందో కూడా తెలియదు. నాకు తెలియకుండానే ఏడిచాను. నాన్నని గట్టిగా పట్టుకున్నాను.

నాన్న ఏమనుకున్నారో ఏమో, "పిచ్చోడా! ఏం ఫరవాలేదు రా. చూడు ఇంట్లో పెద్ద వాడివి, నీకు ఇవన్ని తెలియాలని చెప్తున్నాం. రేపటినించి ట్రీట్మెంట్ తీస్కుంటున్నా. నాకేం కాదు. మీరు మాత్రం ధైర్యంగా ఉండాలి." అని చెప్పారు. కాని అదంతా అబద్ధం అని తరవాత తెలిసింది.

ఆరోజు మొదలు మా ఇంట్లో కష్టాలు పెరిగాయి తప్ప తరగలేదు. నాన్న ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టారు. అమ్మా, నాన్నా హాస్పిటల్ కి తిరగడమే సరిపోయింది. నాన్న చాలా నీరసంగా అయిపోయారు. నాకు తెలిసి మాకు ఆస్తులేం లేవు. ఉన్నా కూడా అప్పుడు కరిగిపోయి ఉంటాయి. అమ్మకి ఉన్న కాస్త బంగారం కూడా అప్పుడు తీసేసింది. మంగళసూత్రం కూడా లేదు.

ఇల్లంతా నరకంలాగా ఉండేది. ఎప్పుడూ అల్లరి, కేకలు వినిపించే మా ఇంట్లో మొత్తం నిశబ్దం కమ్మేసింది. చిన్ను అప్పుడు సెకండ్ క్లాస్. వాడికి ఏం అర్థం అయిందో కాని వాడు కూడా ఏదోలా అయిపోయాడు. నాన్న వాళ్ళ అక్క వాళ్ళు ఒకసారి ఒచ్చి చూసి వెళ్ళారు. అమ్మ సైడ్ వాళ్ళు అసలు రాలేదు అప్పుడు కూడా. మెల్లగా నాన్నకు జుట్టు ఊడిపోయింది. తినటం మానేశాడు. బక్కగా అయిపోయాడు. ఆయన బాధ చూస్తే ఇలా ఉండటం కంటే పోవడమే మంచిది అనిపించింది నాకు. కాని అమ్మతో అనలేదు.

ఆ రోజు కూడా రానే ఒచ్చింది. ఏడ్చి ఏడ్చి అమ్మ కళ్ళల్లో నీళ్ళు కూడా అయిపోయాయి. ఈ టైములో నాన్న గారి ఫ్రెండ్స్ ఒక్కరే మమ్మల్ని ఆదుకుంది. ముఖ్యంగా చలపతిరావు అంకుల్. పెద్దోళ్ళు ఎవరూ లేరు, అసలు

ఏ పని ఎలా చెయ్యాలో తెలియదు, అమ్మ ఈ లోకంలో లేదు. అన్నీ ఆయనే చూసుకున్నారు. చనిపోయాక చెయ్యాల్సిన పనులతో సహా.

తరవాత ఒక రోజు అమ్మ నన్ను పిలిచింది.

"భార్గవా." అమ్మ నన్ను భార్గవా అంటుంది.

"మీ నాన్న మిమ్మల్ని చూసుకోమని కొండంత బాధ్యత నా పైన వేసి వెళ్ళిపోయాడు. ఇప్పుడు నా ముందున్న పని ఒక్కటే. మీరిద్దరూ బాగా చదువుకోవాలి. అంతే.. ఈ జీవితానికి ఇంకేం అక్కర్లేదు. చలపతిరావు అంకుల్ నాకు నాన్న ఆఫీస్ లోనే చిన్న ఉద్యోగం ఇప్పించారు. కాని.."

అమ్మ ఏడిచింది.

"కాని ఉద్యోగానికి వెళ్తే మిమ్మల్ని సరిగ్గా చేసుకోలేను. పోనీ వేరే ఏదైనా చూద్దామా అంటే టెన్త్ కూడా పాస్ కాని నాకు ఎవడిస్తాడు ఉద్యోగం. అందుకే మీ ఇద్దరికోసం ఒక మంచి హాస్టల్ చూసాను. ఇక్కడ నా కష్టాలేవో నేను పడతాను. మీరు మాత్రం అవేమి మనసులో పెట్టుకోకుండా శ్రద్ధగా చదువుకోండి. సరేనా?" అని నన్ను దెగ్గరకు తీసుకుంది.

"ఒద్దమ్మా. అసలే నాన్న లేరు.. ఇప్పుడు మేము వెళ్ళిపోతే నువ్వొక్కదానివే అయిపోతావు. మేము ఇక్కడే చదువుకుంటాం. మా పని మేమే చేసుకుంటాం. నేను కావాలంటే సాయంత్రం ఏదన్న చిన్న పని చేస్తా. కొన్ని డబ్బులు ఒస్తాయి." అని ఏడిచాను.

"అందుకేరా నేను ఒద్దనేది. మీరు చాలా మంచి స్కూల్లో చదువుకోవాలి. చాలా బాగా చదువుకోవాలి. జీవితంలో పైకి రావాలి. ఈ కష్టాల వల్ల మీరెక్కడో ఆగిపోతే అది నేను భరించలేను. మీ నాన్న ఉన్నట్టే, ఇంకా చెప్పాలంటే అంతకంటే ఎక్కువగా మిమ్మల్ని చూసుకోవాలి."

అమ్మ నిశ్చయించుకున్న తరవాత ఆమెని ఎవ్వరూ ఆపలేరు. నన్నూ, తమ్ముణ్ణి హాస్టల్ కి పంపించేసింది. సెవెంత్ క్లాసులో ఈ ఊరికి ఒచ్చాను. లాస్ట్ ఇయర్ టెన్త్ అయిపోయిన తరవాత ఇంటికి ఒచ్చేస్తా అని అమ్మకి చెప్పాను. కాని అమ్మ ఒప్పుకోలేదు. అక్కడ ఒక్కతే కష్టపడుతుంది. నేను ఉద్యోగం చేసే వయసు ఒచ్చేవరకు రావద్దు అని ఖచ్చితంగా చెప్పేసింది. అక్కడుంటే చదువు పైన శ్రద్ధ పెట్టలేను అంటుంది. కరెక్టో కాదో తెలియదు కాని అమ్మ చెప్పింది కాబట్టి అలాగే ఉంటున్నాం.

•                    *                    *

పాపం ప్రీతి. ఇంత సీరియస్ గా  నా గురించి చెప్తా అని ఊహించలేదనుకుంటా. ఏం మాట్లాడలేదు. సైలెంట్ గా అయిపోయింది.

"ఏయ్ పిల్లా...ఏంటి.. ఉన్నావా లేదా?" ఒక నిమిషం ఆగి అన్నాను.

"సారీ భార్గవ్. మీ నాన్న గురించి తెలియక ఊరికే చెప్పు చెప్పు అని అన్నాను. అనవసరంగా గుర్తు తెచ్చుకున్నావు ఇదంతా. రియల్లీ సారీ.." తన గొంతులో తెలుస్తుంది. పాపం ఏడుస్తుందనుకుంటా.

"ప్రీతీ.. పిచ్చా.. ఏడవకు... అయ్యో..నేను బానే ఉన్నా. నాకు గుర్తురావడం, రాకపోవడం ఏమీ ఉండదు. నాన్న ఎప్పుడూ నన్ను ఒదిలేసి వెళ్ళలేదు. ఇప్పుడేం నేను బాధపడట్లేదు. నువ్వు ఏడవకు..ప్లీజ్..."

"కాని మీ అమ్మ గ్రేట్ కదా. ఇన్ని ఇయర్స్ నుంచి మిమ్మల్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నారు. ఒక్కరే పాపం అది కూడా."

"అందుకే నాకిక్కడ ఉండబుద్ధి కాదు. అమ్మేమో రానివ్వదు. సంవత్సరానికి రెండు సార్లు వెళ్తాం అంతే."

"సమ్మర్ ఒస్తుంది కదా. ఇప్పుడు వెళ్తావా?"

"ఆ.. వెళ్తా... ఈసారయినా అమ్మ ఒప్పుకుంటే బాగుండు. అక్కడే ఎక్కడయినా కాలేజీలో చేరతా.."

"అవునా...". ప్రీతి గొంతు డల్ గా అయిపోయింది.

"ఏయ్.  అంత ఫీల్ అవ్వకులే...మా అమ్మ సంగతి తెలుసు నాకు... ప్రతిసారి నేను ఉండిపోతా అనడం, మా అమ్మ పంపించెయ్యడం మామూలే."

"అసలే ఆంటీ దేవతా.." అంది నవ్వుతూ... నన్ను ఏడిపిస్తుంది అని అర్థం అయ్యింది.

"పడతాయి నీకు.." అని ఫోను పెట్టేశాను.

రెండు వారాల తరవాత నేను, చిన్ను వెళ్లాం హైదరాబాద్ కి.

•                    *                    *

హైదరాబాద్ ఒస్తే ఏదో లోకంలోకి ఒచ్చినట్టు అనిపిస్తుంది. అమ్మ చేతి వంట తింటూ, ఆ నెల రోజులు చాలా ఎంజాయ్ చేస్తాం. అమ్మ కూడా మాకోసం ఆ నెల రోజులు లీవ్ పెడుతుంది. ఏ పని పెట్టుకోదు. మాకు వండి పెట్టడం. అప్పుడప్పుడూ మేము ముగ్గురం సినిమాలకు అలా బయటికి వెళ్ళడం అంతే. ఇంకే పని ఉండదు. చిన్నుని నేను చూసుకుంటా, నువ్వెప్పుడయినా ఆఫీస్ కి వెళ్ళమ్మా అవసరం అయితే అని చెప్పినా వినదు అమ్మ.

ఒక రోజు అందరం టీవీలో సినిమా చూస్తున్నాం.

"అమ్మా.. ఈ సినిమా అంటే ప్రీతికి ఎంత ఇష్టమో తెలుసా? మాటిమాటికీ ఈ సినిమా గురించే మాట్లాడుతూ ఉంటుంది." అని చెప్పా.

"ఇంతకీ ఏం నచ్చిందంట సినిమాలో?"

"లవ్ స్టోరీస్ అంటే చాలా ఇష్టం తనకి. కాని చిన్న పిల్ల లాంటిది. చాలా అమాయకురాలమ్మా."

"చిన్న పిల్ల అంటే?"

"అంటే ఏదంటే అది నమ్మేస్తుంది. ఆ లవ్ స్టోరీలన్నీ నిజమని నమ్ముతుంది. ఇంకా చాలా ఉన్నాయిలే."

"తను చిన్న పిల్ల అంటే నువ్వు కాదా."

"ఇంకా నేనేం చిన్న పిల్లోడినమ్మా. నీకలా అనిపిస్తా అంతే. కాని నేను ఇంకా అలా లేను. అందుకే నీకు సాయం చేస్తా అంటే ఒద్దంటావ్."

అలా అనగానే అమ్మ మొహం అదోలా అయిపోయింది. బాధో, కోపమో అర్థం కాలేదు.

"సరే సరే... కోపం తెచ్చుకోకమ్మా. ఊరికే అడిగాను. ఒదిలెయ్." అన్నాను.

అంతలో చలపతిరావు అంకుల్ ఒచ్చారు. మేము హైదరాబాద్ ఒచ్చిన ప్రతిసారీ ఆయన ఒక రెండు మూడు సార్లు ఒస్తారు. మా గురించి కనుక్కొని కొంచం సేపు ఉంది వెళ్ళిపోతారు.

నేను లేచి నుంచున్నాను.

"హలో అంకుల్. ఎలా ఉన్నారు."

“బానే ఉన్నాను. నువ్వెలా ఉన్నావు. బాగా చదువుకుంటున్నావా?”

“బాగున్నా అంకుల్. బానే చదువుతున్నా”

“ఇప్పుడేంటి ఇంటరా?”

“అవును.”

“నెక్స్ట్ ఏం చదవాలన్నా చదువుకో. మీ అమ్మకి ఇబ్బంది అవుతుంది అని మొహమాట పడకు. ఏమన్నా ఉంటే నేను చూసుకుంటా. సరేనా.”

“సరే అంకుల్. ప్రతిసారీ మరిచిపోకుండా చెప్తారు మీరు.”

కాస్సేపు మాట్లాడుకున్నాం. అమ్మ టిఫిన్ చేసింది. అందరం తిన్నాం.

“అవునంకుల్.. ఆంటీ ఎలా ఉన్నారు. ప్రతి సారి మిమ్మల్నే కలుస్తాం. ఒకసారి ఆంటీని కూడా కలవాలి. చాలా ఇయర్స్ అయ్యింది. అజయ్, అనీష్ లని కూడా..”

“బానే ఉన్నారు అందరూ” అని ముగించారు అంకుల్.

“ఓకే..మరి ఎప్పుడయినా ఇంటికి తీస్కెళ్ళండి. చాలా రోజులయ్యింది.” అన్నా

“చూద్దాం లే.” అని అమ్మ వైపు అర్ధం కానట్టు చూసారు అంకుల్.

ఏమైందో. అమ్మకి ఆంటీకి గొడవ ఎమన్నా అయ్యుంటుందో. అమ్మ అలాంటిది కాదే. పైగా ఎప్పుడు చెప్పలేదు కూడా. ఎందుకు లే అని మళ్ళీ అడక్కుండా ఓడిలేశా.

తరవాత అంకుల్ వెళ్ళిపోయారు.

కాస్సేపు టివి చూసి మేము పడుకోడానికి వెళ్ళాం. నేను హాల్లో పడుకున్నా, అమ్మా చిన్నూ లోపల బెడ్ రూమ్ లో పడుకున్నారు.

నాకెందుకో నిద్ర పట్టలేదు. ప్రీతితో చాట్ చేస్కుంటూ కూర్చున్నాను. మధ్యలో బాత్రూంకి వెళ్దామని లేచి వెళ్ళాను. అది బెడ్రూం పక్కన ఉంది. అమ్మ ఫోనులో మాట్లాడుతుంది. చిన్నూ పడుకున్నాడు. వినాలని చూడలేదు బట్ అమ్మ మాటలు వినబడుతున్నాయి.

"ఈ టైంలో ఫోన్ చెయ్యకండి. ఇప్పుడు రావడం కూడా ఒద్దు ప్లీజ్. పిల్లలు పెద్దగవుతున్నారు. భార్గవ్ ఇంకా చిన్నపిల్లోడు కాడు. వాడికి అన్నీ అర్థం అవుతాయి. ఎలాగో ఇన్ని రోజులు అయిపోయాయి. ఇంకా పది రోజులు ఓపిక పట్టండి ప్లీజ్. పిల్లలు వెళ్ళిపోతారు."

ఇంకా వినే ధైర్యం లేకుండే. పక్కకి ఒచ్చేశాను. మనసంతా పిచ్చి ప్రశ్నలతో నిండిపోయింది. నిద్ర పట్టలేదు రాత్రంతా. ఆలోచించడానికి కూడా భయం వేసింది. వాటి నుంచి నన్ను నేనే తప్పించుకోడానికి చాలా కష్టపడ్డాను.

పొద్దున్న లేవగానే ముందు అమ్మ ఫోన్ తీసుకొని రాత్రి మాట్లాడింది ఎవరితోనో చూసాను.
నమ్మలేకపోయాను.

చలపతిరావు అంకుల్.

- * *

రాత్రి ఇంటికి ఒచ్చాను.

పొద్దున్న అమ్మ ఫోన్ చూసేటప్పుడు అమ్మ అక్కడే ఉంది. నేను కోపంగా ఫోన్ పక్కన పడేసి బయటికి ఒచ్చేసాను. రాత్రి వరకు ఇంటికి వెళ్ళలేదు. ఎక్కడెక్కడో తిరిగాను. ఫ్రెండ్స్ ఇంటికి వెళ్దామనుకున్నా కంటే వెళ్ళబుద్ధి కాలేదు. కనిపించిన బస్సు ఎక్కాను. అది ఎక్కడికెళ్తే అక్కడికి వెళ్ళాను. నాన్న గుర్తొచ్చారు బాగా. అమ్మ గురించి ఏమనుకోవాలో అర్థం కాలేదు. చలపతిరావు అంకుల్ ఎందుకలా చేస్తాడు. అమ్మెందుకు అలా మాట్లాడింది. రోజంతా తిండి లేదు. హాస్టల్ కి వెళ్ళిపోదాం అనుకున్నాను.

ఇంక తప్పక రాత్రికి ఇంటికి చేరాను. అమ్మ గుమ్మం దెగ్గర కూర్చుంది. చాలా సేపు ఏడిచినట్టుంది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి.

"ఫోన్ కూడా తీసుకెళ్ళకుండా ఎక్కడికెళ్ళావ్ అన్నయ్యా? అమ్మ ఎంత కంగారుపడిందో తెల్సా?" అరిచాడు చిన్ను గాడు.

అమ్మ వైపు చూసాను. కాని అమ్మ నన్ను చూడలేదు. లేచి వెళ్ళిపోయింది. నాకు అన్నం పెట్టడానికి అన్నీ తెస్తుంది అని అర్థం అయ్యింది.

“నాకు ఆకలిగా లేదు.” అని బెడ్ రూమ్ వైపు నడిచాను.

“కోపం ఏదన్నా ఉంటే నా మీద చూపించు. అన్నం మీద కాదు. నీకు దండం పెడతా. అన్నం తిను. నాతో మాట్లాడడం ఇష్టం లేకపోతే నేను ఇక్కడినించి వెళ్ళిపోతాను. కాని నువ్వు తినను అనకు.” అని చెప్పి స్నానానికి వెళ్ళిపోయింది.

నాకు తినబుద్ధి కాకున్నా మళ్ళీ అమ్మ గొడవ చేస్తుందని కొంచం తిన్నాను. అమ్మ బయటికి ఒచ్చేలోపు పడుకున్నాను. కనీసం కళ్ళు మూసుకొని పడుకున్నట్టు నటించాను.

కాని పడుకునే ముంది ఒక పేపర్ తీసి ‘రేపు హాస్టల్ కి వెళ్తున్నాను.’ అని రాసి, దిండు పక్కన  పెట్టి పడుకున్నాను.

అమ్మ ఏమనుకుందో కాని ఏమీ మాట్లాడలేదు. చిన్నుకి అన్నం పెట్టి పడుకోబెట్టింది. తను తిన్నట్టు శబ్దం మాత్రం రాలేదు. నేను మాత్రం దుప్పట్లోనుంచి కదలలేదు. కళ్ళు తెరవలేదు. లేచి అమ్మను తినమని చెప్పాలనిపించింది. కాని చెప్పలేదు.

అస్సలు నిద్ర పట్టలేదు. అటు ఇటు కదులుతూనే ఉన్నాను. అమ్మ బెడ్ రూమ్ నుంచి అలికిడి అవుతుంది. తను కూడా పడుకున్నట్టు లేదు.

లేచి కూర్చున్నాను. ఏడిచాను.... చాలా.

అమ్మ నా బట్టలు సర్ది పెట్టింది. నేను ప్రతిసారీ తీసుకెళ్ళే తిండి వస్తువులు కూడా. అన్ని సర్ది, పక్కన డబ్బులు కూడా పెట్టింది. అంటే నా చీటీ చూసిందన్నమాట. దుఃఖం ఇంకా ఎక్కువయ్యింది.

బెడ్ రూమ్ దెగ్గరికి వెళ్ళాను. డోర్ దెగ్గరే ఆగాను. లోపలి చూడలేదు.

“అమ్మా..... నువ్వు మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నావా?” అని అడిగాను.

సమాధానం లేదు. అమ్మ ఏడుపు మాత్రం వినిపించింది.

ఎప్పుడు తెల్లారుతుంది అని ఎదురు చూస్తూ కూర్చున్నాను.

పొద్దున్నే ఆరింటికి బస్సు ఉంటుంది. లేచి స్నానం చేసాను. నేను వెళ్ళిపోతే చిన్ను ఎలా ఒస్తాడో అనిపించింది. వాడికి ఒదిలిపెట్టి పోబుద్ది కాలేదు. కాని తప్పదు. ఇంకో పది రోజులు వాడు ఇక్కడే హాయిగా ఉంటాడు. కావాలంటే అమ్మ తీసుకొస్తుందిలే అనుకున్నాను.

నేను స్నానం చేసేవరకు అమ్మ లేచి టిఫిన్ చేసింది. నాకు బట్టలు కూడా తీసిపెట్టింది. అమ్మతో మాట్లాడకుండా ఇవన్ని చేయించుకోవడం నచ్చలేదు నాకు. ఏదో తప్పు చేస్తున్నాననే భావన. మళ్ళీ అమ్మ చేసిన పని ఇవన్ని గుర్తొస్తున్నాయి మాటిమాటికి.

“నాకు టిఫిన్ అక్ఖర్లేదు. బయట తింటా.” అని చెప్పి బాగ్ తీసుకొని ఒచ్చేశాను.

ఆరింటి బస్సు ఎక్కితే రాత్రికి దిగుతాను.

ఎప్పుడూ రాత్రి బస్సు ఎక్కడమే అలవాటు. పొదున్నకల్లా దిగిపోవచ్చు. కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో రాత్రి వరకు ఆగడం నా వల్ల కాలేదు. కాని ఇంట్లోంచి ఒచ్చేసినా తేడా ఏమీ లేదు. మనసంతా ఏదో మేలి పెట్టి తిప్పేస్తున్నట్టుగా ఉంది. ఈ ఫీలింగ్ ఎప్పుడు పోతుందో ఏమో. ఒకసారి చచ్చిపోవాలని కూడా అనిపించింది. కనీసం అమ్మ పెళ్ళి చేసుకుంటున్నా అని చెప్పినా బాగుండేది. ఎక్కడో మూలలో ఆ ఆశ ఉండింది నాలో. కాని ఇప్పుడు అది కూడా లేదు. కోపమో, బాధో ఇంకెంతో తెలియదు. అమ్మతో మాట్లాడకూడదు ఇంకా అనుకున్నా. కాని ఈ స్కూలు, తిండి, బట్ట అన్ని అమ్మ పెట్టేవే. అందుకే చావు గుర్తొచ్చింది. నాన్న గుర్తొచ్చారు. ఆయన ఉంటె ఎంత బాగుండేది. ఇలా జరుగుతుందని ఆయన ఎప్పుడూ ఊహించి ఉండరు. చివర్లో ట్రీట్మెంట్ వల్ల మనిషి మనిషిలో లేరు ఆయన. ఏమీ గుర్తుండకపోయేది. తడబడేవారు. కాని అలాగే ఉన్నా బాగుండు. పోకుండా.

అసలేం జరిగింది. ఎందుకు జరిగింది. ఇదే నా మెదదంతా. వేరే విషయాలు ఆలోచిద్దాం అని ఎంత ప్రయత్నించినా నా వల్ల కాలేదు. ఇదే రాత్రి బస్సు అయ్యుంటే బాగుండేది. కనీసం పడుకోవచ్చు.

ప్రీతికి ఫోను చేశాను. ఎత్తలేదు. ఎక్కడో చుట్టాల ఉంట్లో ఉన్నా, కుదరదు అని మెసేజ్ ఇచ్చింది. రాత్రికి ఒస్తున్నా, వీలైతే రేపు కలవమని రిప్లై ఇచ్చాను. చాలా హ్యాపీ, రేపు కలుస్తా అని చెప్పింది. తనతో మాట్లాడినా కాస్త రిలీఫ్ గా ఉండేది. తన లోకంలోకి నన్ను లాక్కెళ్ళిపోతుంది.

మధ్యలో లంచ్ కి బస్సాపారు. నేను దిగలేదు. తినలేదు.

డైరెక్ట్ గా రాత్రి ఊళ్ళో దిగి హాస్టల్ కి వెళ్ళాను. నా రూంలో ఎవ్వరూ లేరు. ఇంకా ఎవరూ రారు కదా.

బెడ్ మీద పడ్డాను. ఆకలవుతుంది. ఇక్కడ తినాలనిపించలేదు. పక్కన హోటల్లో ఏమైనా తెచ్చుకుందాం అని లేచాను. జేబులో చూశాను. అమ్మ ఎప్పటికంటే ఎక్కువ డబ్బులే పెట్టింది. కాని దానితోపాటు ఒక కాగితం కూడా  ఉంది. పొద్దున్నించి ఉందా? నేను గమనించనే లేదు.

తీసి చూశాను. అమ్మ రాసి పెట్టింది. ఉత్తరం.

'భార్గవా,

ఈ రోజు ఎప్పుడో ఒకప్పుడు  ఒస్తుందని నాకు తెలుసు. తెలిసినా ఇది ఎంత ఆలస్యంగా ఒస్తే అంత బాగుండు అని దాటవేస్తూ వచ్చాను. ఎందుకంటే ఈరోజు తరవాత నా జీవితం ఎలా ఉంటుందో, అసలు ఉంటుందో ఉండదో నాకు అంతుబట్టేది కాదు. కాని నాకు దాని మీద చింత లేదు. ఇప్పుడు నువ్వు పెద్దవాడివి. నేను చెప్పేది వినాలంటే, విని అర్థం చేసుకోవాలంటే నీ మనసు కూడా పెద్దది చేసుకోవాలి.

నా వయసు 18 ఉన్నప్పుడు నా పెళ్ళయ్యింది. ఆరోజు నుంచి మీ నాన్నే నాకు లోకం. వేరే అయిన వాళ్ళెవరూ లేరు. మీరు పుట్టేవరకూ ఆయనే నా ప్రపంచం. తరవాత మీరిద్దరూ. ఇంకేవారూ అక్కరలేదనుకున్నాను. నీకు గుర్తుండే ఉంటుంది. మన చిన్న ప్రపంచం మనకెంత హాయిగా ఉండేదో. మీ నాన్న జీతం ఎంతుందో అంతలోనే మన ఇల్లు హాయిగా నడిచేది. ఎప్పుడయినా ఇబ్బందయినా అందులోనే సర్దుకునేవాళ్ళం. ఇది నీకు ఎందుకు చెప్తున్నానంటే మీ నాన్న ఉన్నప్పుడు దాచింది ఏమీ లేదు. వెనక ఆస్తులు కూడా లేవు. ఆనందం మాత్రం ఉండేది.

అలాంటి సమయంలో అనుకోకుండా ఆయన కాన్సర్ బారిన పడ్డారు. మీరింకా చిన్న పిల్లలు అప్పటికే. ఒచ్చిన నాడే డాక్టర్ చెప్పారు ఒక సంవత్సరం కంటే మీ నాన్న ఎక్కువ ఉండే అవకాశం లేదు అని. అది విన్ననాడే సగం చచ్చాను నేను. మీ ట్రీట్మెంట్ కోసం చాలా కష్టపడ్డాం. మనది అనేది ఏదైనా విలువ ఉన్న వస్తువుంటే అది అప్పుడు కరిగిపోయింది. డబ్బు ఎక్కడినించి ఒస్తుంది, తరవాత మనం ఎలా బతకాలి అని నేను ఏనాడు ఆలోచించలేదు. మీ నాన్న వీలయినన్ని రోజులు మనతో ఉండాలి. అదొక్కటే ఆలోచించాను. అంతే.

అది తప్పో, ఒప్పో నాకు తెలియదు. నువ్వే చెప్పాలి. ఎంత కష్టపడ్డా ఆయన ఒక ఏడాదికి పోయారు. ముందే తెలుసు అయినా నేను తట్టుకోలేకపోయాను. మీకోసం తెరుకొని చూసేసరికి చేతిలో రూపాయి లేదు. ఒక నాలుగు లక్షలు అప్పు అయ్యింది. అదంతా చలపతిరావు చూసుకున్నారు. మీ నాన్న పోయాక నాకు చెప్పారు. ఆ డబ్బంతా ఆయనే కట్టారు. మీ చదువులు, అవసరాలు అన్నీ ముందున్నాయి.

నాకు భయం వేసింది. నేను హై స్కూలు కూడా సరిగ్గా పాసు కాలేదు. నాకు ఉద్యోగం ఎవరిస్తారు. ఆ డబ్బు ఇవ్వకుండా ఆయనకు ఓ నమస్కారం పెట్టి, మిమ్మల్ని తీసుకొని  ఏ ఊరికయినా వెళ్ళిపోదాం అనుకున్నా. కాని ఎక్కడికెళ్ళినా ఏ చిన్న పని చేసో బతకాలి. బతకోచ్చేమో.... కాని మీ భవిష్యత్తు? మిమ్మల్ని కూడా నాలా ఏదో గవర్నమెంట్ స్కూల్  చదువులతో సరిపెడితే మీ నాన్నగారి కోరిక తీరదు అనిపించింది. మీరు కూడా నా వల్ల జీవితాంతం కష్టపడతారు అనిపించింది. మీరు పుట్టినప్పటినించి మీ నాన్న అనేది ఒక్కటే.. మీరు బాగా చదవాలి అని....గొప్ప వాళ్ళు కావాలని.. అదే నా చెవుల్లో మార్మోగింది. కాని ఎలా.... ? మిమ్మల్ని చదివించడానికి మార్గం ఏది. మాట్లాడడానికి కాని, ఒక సహాయం అడగడానికి కూడా ఎవరూ లేరు. నేను ఒక్క దాన్నే..

అలాంటి సమయంలో చలపతిరావు ఒచ్చారు. తన బాకీ మొత్తం మాఫీ చేస్తా అన్నారు. మీరు జీవితంలో ఎంత చదువుతారో, ఒక మంచి జీవితానికి మీకేం అవసరం అవుతుందో ఆయనే చూసుకుంటా అన్నారు. అలా అని నోటు మీద రాసిచ్చారు. కాని నన్ను ఆయనతో ఉండమన్నారు.

ఈ విషయం రాయడానికి ఎంత నరక యాతన అనుభవిస్తున్నానో ఆయన ఆ మాట అన్నప్పుడు అంతకు వెయ్యింతలు అనుభవించాను. ఆయన మంచివాడో, చెడ్డవాడో నాకు తెలియదు. కాని నా కళ్ళముందు మీరిద్దరే ఉన్నారు. ఒక నిర్ణయం తీసుకుంటే చాలీ చాలని చదువుతో జీవితాంతం కష్టపడే మీరు, ఇంకో నిర్ణయం తీసుకుంటే మీకు కావాల్సింది చదువుకొని జీవితంలో స్థిరపడే మీరు. దీనికి నేను నా జీవితంలో నుంచీ ఒక పదేళ్ళు ఆహుతి ఇవ్వాలి.

కాని అది నన్ను జీవితాంతం వెంటాడుతుంది. కొన్ని రోజులు ఉద్యోగం చేద్దామని ప్రయత్నించాను. మీరనుకున్నట్టు నాన్న గారి ఆఫీసులో నాకు ఉద్యోగం ఇవ్వలేదు. ఒక ఆయా పని. కాని నెల తిరిగేసరికి మీ స్కూల్లో ఫీసు కట్టమని, కట్టకపోతే తీసేస్తామని చెప్పారు. నా ఆయా జీతం మీ ఫీసుకే సరిపోలేదు. ఆ రోజే చలపతిరావు దెగ్గర నోటు మీద రాయించుకున్నాను. కాని మీరు ఇక్కడుంటే నా విషం మీకు అంటుకుంటుంది అని మిమ్మల్ని హాస్టల్ కి పంపేసాను.

నేను చేసింది నీచమయిన పని అని నీకు అనిపించొచ్చు. అది నిజం. నేను ఒప్పుకుంటున్నాను. నేను చేసినది తప్పే. కాని దానికి నిన్ను నువ్వు శిక్షించుకోకు. నన్ను శిక్షించు. నాతో మాట్లాడకు, నన్ను తిట్టు, కాని నా గురించి ఎక్కువగా ఆలోచించకు. కేవలం చదువుకో. నువ్వు ఒక మంచి స్థితికి చేరుకున్నాక అప్పుడు కావాలంటే నన్ను నీతో తీసుకుపో. ఒద్దనుకుంటే ఇంకా మంచిది. నీ తమ్ముడిని బాగా చూసుకో. మీరిద్దరూ కలిసుండాలి ఎప్పటికి. మీతో నేను లేకుంటే ఏమీ ఫరవాలేదు. నా గురించి నాకు పట్టింపు లేదు.

ఇది నువ్వు నన్ను  అర్ధం చేసుకోవాలని కాదు. నీ దృష్టి నువ్వు బాగుపడాలని మాత్రమే ఉండాలని. వేరే ఏ బాధ నిన్ను దారి తప్పించొద్దని. అదే మీ నాన్న ఆఖరి కోరిక. నా ఆఖరి కోరిక కూడా.

నువ్వు ఒప్పుకుంటే మీ అమ్మ.'

ఇది చదివాక నా మీద నాకే అసహ్యం వేసింది. చదువుతున్నంత సేపు ఏడుస్తూనే ఉన్నాను. అమ్మ కావాలి అనిపించింది. కాని ఫోన్ చేసే ధైర్యం చెయ్యలేకపోయా. నేరుగా వెళ్లి అమ్మ కళ్ళ మీద పడిపోవాలి.

టైం చూసా. రాత్రి బస్సు పట్టుకోవచ్చు. పొద్దున్నే హైదరాబాదులో దింపేస్తుంది.

- * *

బస్సెక్కాను. మనసు కొంచం ప్రశాంతంగా అనిపించింది. అమ్మని కలుస్తున్నాను అని అనుకుంటా. రాత్రి హాయిగా నిద్ర పట్టింది. అమ్మ నన్ను క్షమిస్తుంది అని నమ్మకమేమో. హైదరాబాద్ ఒచ్చే 10 నిమిషాల ముందు వరకు హాయిగా పడుకున్నాను. లేచి ఫోన్ చూసుకున్నాను. అమ్మ దెగ్గర నుంచి మిస్డ్ కాల్స్ ఉన్నాయి. కాని కాల్ చెయ్యలేదు. నేను అమ్మనీ నేరుగా చూడాలి.

ప్రీతి దెగ్గరనుంచీ కాల్స్ ఉన్నాయి. మెసేజెస్ ఉన్నాయి. తనకు ఫోన్ చేశా.

"ఏయ్. ఇవ్వాళ కలుస్తా అన్నావ్ కదా. ఎప్పుడు? ఎక్కడ?" అండి ఫోన్ ఎత్తగానే.

"సారీ ప్రీతి. నేను హాస్టల్ కి ఒచ్చాను. కాని మళ్ళి హైదరాబాద్ వెళ్తున్నా. ఒచ్చేవారం ఒస్తా."

"అదేంటి. ఎందుకు ఒచ్చావ్. ఎందుకు వెళ్తున్నావ్."

“ఊరికే”

“ఊరికే ఏంటి. పిచ్చా. అంత దూరం నుంచి ఒచ్చి మళ్ళీ వెళ్ళడం ఏంటి”

“ఒచ్చాను. కాని మా అమ్మకి సప్రైస్ ఇద్దాం అనిపించింది. అందుకే.”

“సప్రైసా.. ఎందుకు?”

“ఎందుకేంటి.. ఎప్పుడు చెప్తుంటా కదా అందుకే.”

“ఏం చెప్తుంటావ్?”

“అదే....”,“మా అమ్మ దేవత.....నిజంగా”

# 3. మారుతి స్టోర్స్

"'అందరికి పెళ్లయిపోతుంది. నీ కంటే పెద్దోళ్ళది అయింది, నీతోటోళ్ళది అయిపోయింది. ఇప్పుడు నీకంటే చిన్నోళ్ళది కూడా అయిపోతుంది. నువ్వు మాత్రం అలాగే ఉండు. సరేనా.'

అనే అమ్మ వాళ్ళ ఎత్తి పొడుపు మాటలు తట్టుకోలేక, చివరికి ఈ సంవత్సరం పెళ్ళి చేసుకున్నా. యు ఎస్ ఒచ్చి 8 ఇయర్స్ అయినా ప్రతి ఇయర్ ఇండియాకి మాత్రం ఒస్తుంట తప్పకుండా. అదీ డిసెంబర్ లోనే ఒస్త. అది పెళ్ళిళ్ళ సీజన్ కదా అమ్మ నాన్న రాగ్గింగ్ ఇంకా ఎక్కువ ఉండేది. నో మొత్తానికి ఒక పని అయిపోయిందని నాకంటే అమ్మ వాళ్ళే ఎక్కువ సంతోషిస్తున్నారు."

ఇలాంటి విషయలు పెళ్ళయిన కొత్తగా పెళ్ళయి ఇంటికి ఒచ్చిన అమ్మాయికి చెప్పడం తప్పో ఒప్పో తెల్వదు. పెళ్ళికి ముందు ఒక రెండు నెలలు మాట్లాడుకున్నా, ఇప్పుడు అంతా కొత్తగనే ఉంది. అయింది వారమే కదా.

ప్రియాంక మొహం చూస్తే తప్పేనేమో అనిపిస్తుంది.
"అంటే మీ కన్నా మీ అమ్మా, నాన్నే హ్యాపీగా ఉన్నారా? మీరు లేరా?" అని అడిగింది మూతి వంకరగా పెట్టుకొని.

"అనుకున్నా. నీకా డౌట్ ఒస్తదని. నేను ఏదో చెప్పబోయి ఇంకేదో చెప్పిన. నాకు మాట్లాడడం సరిగ్గా రాదని చెప్పిన కదా ముందే."

"నాకేం అట్ల అనిపిస్తలేదు. కావాలనే అన్నట్టుంది. నచ్చకపోతే ఎందుకు చేసుకున్నట్టు మరి పెళ్ళి." అన్నది కొంచం వయ్యారంగా.

"దేవుడా... కథ ఎక్కడినించి ఎక్కడికి పొయ్యింది. మా అమ్మవాళ్ళ రాగ్గింగ్ గురించి చెప్పాలి అనుకున్న. అంతే.. చెప్పాల్నంటే నేను చాలా హ్యాపీగా ఉన్నా. నా జీవితంలో ఇదే గొప్ప సంఘటన. నాకంటే అదృష్టవంతుడు ఈ లోకంలో ఉండడు. చాలా..ఇంకా నీ మీద ఒట్టేసి చెప్పనా.."

"సరే.. సరే.. నమ్మిన. అనవసరంగా నా మీద ఒట్టెందుకు..అసలే కొత్తగా పెళ్ళయిన దాన్ని. మా ఆయన ఒక్కడే అయిపోతాడు పాపం..." అని నవ్వింది.

అంతలోనే షాపు ఒచ్చింది. కారు గోడ పక్కన పార్క్ చేశాను.

“అంత సంతోషంగా ఉన్నోళ్ళయితే ఏ మోర్ కో, డి మార్ట్ కో తీస్కపోవాలి  గాని, ఈ గల్లీ పక్కన చిన్న షాపు. ఇక్కడికెందుకు తెచ్చినట్టు మరి.” అన్నది పక్కనున్న షాపుని చూసి.

“దాని గురించి చెప్దామనే ఈ టాపిక్ తెచ్చిన అంతలోపు షాపే ఒచ్చింది. పొయ్యేటప్పుడు చెప్తా. కాని ఈ షాప్ తెలిసిన వాళ్ళది. ఈ అంకుల్ అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పుడు అమ్మ ఏదన్నా తెమ్మని చెప్పంగానే ఉరుక్కుంట ఇక్కడికే ఒస్తుండే. ఇప్పటివరకు అదే చేస్తున్నా.”

కారు దిగినం. షాపు అట్లనే ఉంది కాని కొంచం పాతబడింది. కళ తప్పుతుంది. పగుళ్ళు ఒచ్చిన గోడలు. అక్కడక్కడ బూజు. ముందు కౌంటర్ ల చాక్లెట్ సీసాలు, ఒక పక్క మూలకి నూనె డబ్బాల జిడ్డు, ఎదురుంగ దేవుడి ఫోటోల పక్కన అగరుబత్తి, కూర్చుంటే, లేస్తే కిర్ కర్ మనే పాత స్టూల్ మీ అంకుల్, బయట కూల్ డ్రింక్ క్రేట్స్, కొబ్బరికాయల సంచి, పది సార్లు కిక్ కొడితే గాని స్టార్ట్ కాని పాత స్కూటర్, పైన పయిన బోర్డు మీద పేరు, “మారుతి స్టోర్స్.”…

మమ్మల్ని చూడంగనే లేచి పలకరించిండు అంకుల్.

“ఏం రమేష్. బాగున్నవా? ఏంది పెండ్లి అయ్యి మూడు రోజులు కూడా కాలే అప్పుడే బయట తిరుగుతున్నవు?”

“అట్లనుకుంటే ఎట్లా అంకుల్. తప్పదు కదా. అయిన వారం అయితది రేపటికి.”

అంతల ప్రియంకని చూసి, “ఏమ్మా బాగున్నవా? లోపలికి ఒచ్చి కూర్చో.” అని కుర్చీ ఏశిండు.

మళ్ళీ తనతో, “గుర్తున్నానా..మొన్న పెళ్ళికి ఒచ్చినం.” అన్నడు.

“ఫరవాలేదు అంకుల్. ఎందుకు గుర్తులేరు, ఆంటీ కూడా ఒచ్చిన్రు కదా పెళ్ళికి.” లోపలికి పోకుండా బయటనే ఉండి అన్నది ప్రియాంక. బానే గుర్తుపెట్టుకుంది అనుకున్నా.

“ఎమన్నా సామాను కావాలని పంపించిందా అమ్మ.” అని అడిగిండు మెల్లగా.

అవునని లిస్టు తీసి ఇచ్చిన.

“సరే నేను కట్టి పెడ్తుంట, అట్ల లోపలి పొయ్యి ఉంట్ల కూసొండి.. ఈడ వేడిగ ఉంటది మీకు.” అని ఆంటీని పిలిచిండు.

“ఏం ఫరవాలేదు అంకుల్. ఇక్కడే ఉంటాం. నాకు అలవాటే కదా.”

“అసలే అమ్రీకా మీది. ఈ వేడి అలవాటు ఉండదు కదా.”

“ఏం కాదు. మేం ఎప్పుడు హైదరాబాదే.” ఇది అందరికి చెప్పి చెప్పి అలవాటు అయిపోయింది నాకు.

“అంతేనంటవా. ఏమో మల్ల. మావోనికి మస్తు కష్టం అయ్యింది పాపం. మస్తు ఇబ్బంది పడ్డడు.”

“ఓహ్.. మీ అబ్బాయి  కూడా అమెరికాలోనే ఉంటాడా అంకుల్.” అడిగింది ప్రియాంక.

“అవునమ్మా. ఇగో... రమేష్ పోయినంకనే ధైర్యం ఒచ్చి పంపించిన. ఒక అయిదారేండ్లు ఐతుంది. అది కూడా మీ మామయ్య వల్లనే.. మంచోడు రెడ్డిసాబ్. మా రాజును పంపించాల్నా ఒద్దా అని ఆలోచిస్తుంటే ఏం కాదు అని ధైర్యం చెప్పిండు. ఆయన  పుణ్యమాని మావోడు సెటిల్ అయ్యిండు.”

అంకుల్ రాజు గురించి చెప్తే చిరాకు నాకు. ఒచ్చినప్పటినుంచి ఎప్పుడయినా ఆ టాపిక్ ఒస్తదెమో అని భయపడుతూనే ఉన్నా. తప్పదని తెలుసు. కాని ఇది ఒకసారి ఒస్తే ఇంక ఆగదు.

ఆంటీ రెండు ప్లేట్లల్ల ఏవో స్వీట్లు పెట్టుకొని ఒచ్చింది.

“అయ్యో. ఇప్పుడేం ఒద్దాంటీ.. తినే ఒస్తున్నం మేము.” అని లేచింది ప్రియాంక.

“అయ్యో. కొత్తగా పెళ్ళయినోళ్ళు. మొదటిసారి ఒచ్చిన్రు. అట్లెట్ల పోతరు.” అని బలవంతంగా చేతిల పెట్టింది ఆంటీ. నా దిక్కు అదోలాగ చూసింది ప్రియాంక. తిను అని సైగ చేసి నవ్విన.

“అవునే. మన రాజు ఉండేది ఎక్కడ. నార్త్ కరోలినా నా?” ఆంటీని అడిగిండు అంకుల్.

“ఆ.. అదే.. ప్రతిసారీ చెప్తా.. మల్ల ఎవరన్నా ఒచ్చినప్పుడు అడుగుతనే ఉంటడు?” నిష్ఠూరం పడ్డది ఆంటీ.

ఈ రాజు గాని టాపిక్ ఆగేది లేదని అర్థం అయ్యింది.

“సరే అంకుల్. మీరు కట్టి పెట్టున్రి. కొంచం సేపు ఆగి ఒస్తం మేము.” అని బయల్దేరినం ఆడినుంచి.

బయటికి రాంగానే ప్రియాంక అన్న మాట, “తెలిసిన వాళ్ళ దెగ్గరికి అని ముందే చెప్తే మంచిగ రెడీ అయ్యి ఒస్తుండే కదా. ఎదో ఇంటి సామాన్లు తేవడానికి అని చెప్పి తెచ్చిన్రు.”

“ఏం కాదులే. చాలా బాగున్నావు. వాళ్ళు అంత స్పెషల్ గా ట్రీట్ చేస్తరు అని నేననుకోలే. మంచోళ్ళు పాపం.”

“మరి మంచోళ్ళు అయితే పాపం వాళ్ళబ్బాయి గురించి చెప్తుంటే అట్ల మధ్యలో ఒచ్చేసిన్రేంది? ఏమనుకున్నరో.”

“ఏమనుకోరులే. వాళ్ళేం చుట్టాలు కాదు కదా.”

“హ్మ్.”

“ఆ రాజేష్ గాడంటే పెద్ద ఇష్టం లేదు నాకు. అదో రకం మనిషి. వీళ్లేమో రాజు, రాజు అని వాడి గురించే చెప్తుంటరు”

“వాళ్ళింటికి పోతే వాళ్ళ కొడుకు గురించి చెప్పకుండా ఇంకెవరి గురించి చెప్తరు మల్ల. ఐనా ఏమయింది. చిన్నప్పుడు ఎమన్నా కొట్టుకున్నరా?”

“అంత సీన్ లేదు. నాకంటే చిన్న పిల్లగాడు వాడు. రెండు మూడేండ్లు అనుకుంటా. లాస్ట్ ఇయర్ నేను ఇండియాకి ఒచ్చినప్పుడు వాడు కూడా ఒచ్చినుండే.”

“ఒచ్చి?”

“ఇప్పుడు కథంతా చెప్పమంటవా? సరే విను ఓపిక ఉన్నంత సేపు..

అసలు నాకు రాజేష్ గాడితో పెద్ద పరిచయం లేదు ఎప్పుడూ. షాపు ఇల్లు అదే కాబట్టి అప్పుడప్పుడూ అక్కడ కనపడేటోడు. నో పెద్దగా ఒపీనియన్ కూడా లేదు.

అందరిలాగా నేనుకూడా ఇంజనీరింగ్ అయ్యేసరికి యుఎస్ మీద పడ్డా. నీకు తెల్సు కదా. ఇక్కడ ఒకటి ఊహించుకుంటాం. అక్కడ పొయినంక వేరే లాగుంటది సిచుయేషన్. మాస్టర్స్ అవ్వడానికి ఒక సెమిస్టర్ ముందు ఇండియాకి ఒచ్చిన. అప్పుడు ఒకరోజు ఈ షాపు అంకుల్ ఇంటికొచ్చిండు. నా కోసమే.”

- * *

నేను హాల్ లోకి ఒచ్చేసరికి నాన్నతో మాట్లాడుతున్నరు అంకుల్.

“ఏమో రెడ్డి సాబ్ మీరు చెప్తున్రు అంటే నిజమే అయ్యుంటది కాని నాకే భయం అయితుంది.”

“నేను చెప్తున్న అని కాదు. మీరు అన్ని అలోచించి చెయ్యండి.” అంటున్నరు నాన్న.

“హలో అంకుల్. ఎట్లున్నరు?” అని మధ్యల దూరిన నేను.

“హలో రమేష్ బేటా. ఏంది ఒచ్చి రెండు వారలయితుందంట. ఒక్కసారి కూడా రాలే అంకుల్ షాప్ లకి. అంతేలే  మీ అమెరికా ఓళ్లకి మా షాపు ఏడ ఆన్తది.” అన్నడు నవ్వుకుంటా.

“అయ్యో. నేను జెట్ లాగ్ ల ఉన్న అంకుల్. అంటే అక్కడ, ఇక్కడ టైం చేంజ్ ఉంటది కదా. నో నిద్ర సరింగ పట్టదు కొన్ని రోజులు. నాకు కూడా అలవాటు లేదు కాబట్టి. జెర పిచ్చిపిచ్చిగ ఉంది.”
“అవునా. చూశ్నవా నాకు అది కూడా తెల్వదు. అందుకే నిన్ను ఒక ముచ్చట అడుగుదాం అని ఒచ్చిన.”

“చెప్పండి అంకుల్.”

“ఏంలేదు. మా రాజేష్ ఎర్కనే కదా. నీ కంటే రెండేండ్లు చిన్నోడు. వాడు కూడ పాస్ అయితడు ఇంజనీరింగ్ ఈ నెల. ఇప్పుడు వాడేమో అమెరికా పోత అని లొల్లి చేస్తుండు. మాకా తెల్సినోళ్ళు ఎవ్వరు లేరాడ. వాని దోస్తు వాళ్ళ అన్నలు ఉన్నరు అది ఇది అంటుండు కాని. పంపాల్నో ఒద్దో, ఆడ ఎట్లుంటదో అర్థం అయితలే.”

“పంపించండి అంకుల్. ఏం ఆలోచించకండి. చాలా హెల్ప్ అయితుంది. చాలా మంచి డెసిషన్.” అనేశ్న ఆయన చెప్పేది పూర్తి కాకుండ.

“అంటే పైసలు అవి ఎన్నయితాయి. వాళ్ళు చెప్పిన దాని మీద ఎమన్న అయితయా?”

“అంటే ఫస్ట్ సెమిస్టర్ ఫీజు ఇక్కడినించి తీస్కపోవాలె అంకుల్. ఇంకా వేరే అమౌంట్ i20 ల ఇస్తరు. అది కూడా తీస్కపోవాలి.”

“మరి ఫస్ట్ సెమిస్టర్ అయినంక?”

“అది స్కాలర్షిప్ తేచుకుంటరు, అక్కడ ఇక్కడ జాబ్ చేసి నడిపిస్తరు.”

ఒక్క నిమిషం కిందికి చూసి ఏదో ఆలోచించిండు అంకుల్.

“ఏం ఆలోచిస్తున్నరు. చూడండి, నాకు తెల్సినంతల చెప్తున్నా. ఇంట్లో ఒక్కడు అమెరికా పోతే ఫ్యామిలీ మొత్తం సెట్ అయితుంది. పోయినోళ్ళు ఎట్లైనా బాగుపడ్తరు. వాళ్ళతో పాటు మొత్తం ఫ్యామిలీని ఒక మెట్టు ఎక్కిస్తరు. ఇది నేను ఎంత మంది ఇండ్లల్ల చూడలే అనుకున్నరు. ఇప్పుడు నేనెట్ల పంపిన అనుకున్నరు.

ఫస్ట్ సెమిస్టర్ ఫీజు ఇక్కడ లోన్ తీసి పంపిన. మిగితాది అక్కడ వాళ్ళే సంపాదించుకుంటరు. పెట్రోల్ పంప్ లల్ల హోటల్లల్ల పని చేస్తరు. " అని సముదాయించిండు నాన్న.

"మీరంటే ఉద్యోగులు. లోన్ తీస్తరు. రేపెమన్న పిల్లోనికి అవసరమున్నా చూసుకుంటరు. కాని మేము చిన్నోల్లం. ఆ షాపు తప్ప ఏమీ లేదు. ఇంక వీనెనక పిల్ల కూడ ఉన్నది కదా నాకు."

"అన్ని బాగయితయి. ఎక్కువ తక్కువ ఆలోచించకుండా పంపించేయ్. ఏదో ఒకటి చేసి లోన్ తీస్కో. కావాల్నంటే సైన్ చేస్తా." అని ధైర్యం చెప్పిండు నాన్న.

ఏదో విన్నట్టు విని ఎల్లిపోయిండు అంకుల్. పొయినంక సంతకం పెడ్తా అన్నందుకు అమ్మ కొంచం తిట్టింది నాన్నని.

అది జరిగిన కొన్ని రోజులు అంకుల్ కనపడలేదు. నేను, ఫ్రెండ్స్, తిరుగుళ్ళు, టైం గడిచిపోయింది. నేను వెళ్ళే రోజు ఒచ్చింది. ఇన్ని సార్లు ఇండియా ఒచ్చిన కదా. ప్రతిసారీ ఒకటి కామన్. నేను రిటర్న్ పొయ్యే రోజు ఇల్లంతా హడావుడి. నన్ను కలవడానికి ఒచ్చే ఫ్రెండ్స్, వాళ్ళ చుట్టాలకి నాతో పాకెట్లు పంపించాలనుకునేవాళ్ళు, నా సూట్ కేసు సర్దుతున్న అమ్మ, వెయిట్ ఎక్కువయిపోతుంది అని 5 నిమిషాలకు ఒకసారి భయపెట్టే నాన్న.

ఇదే పనిల అందరం ఉన్నప్పుడు ఒచ్చిండు అంకుల్, రాజేష్ ని తీసుకొని. చాలా రోజుల తరవాత అప్పుడే చూడడం రాజేష్ ని. ఏం మారలే వాడు చిన్నప్పట్నించి. అమాయకుడిలాగ ఉంటడు. ఎక్కువ మాట్లాడడు. ఈ రోజుల్లో  టైలర్ దెగ్గర కుట్టించిన బట్టలు ఎవరు ఎస్కుంటున్నరు. ఇంజనీరింగ్ చదివే పిల్లలు, అమెరికా పెళ్దాం అనుకునే పిల్లలు అయితే ఇంకా కష్టం. కాని రాజేష్ అట్లనే ఉండు.

"లోన్ అప్లై చేసేశ్న రెడ్డిసాబ్. ఒచ్చేస్తది. రెండు రోజులల్ల. సరే బాబు పోతుండు కదా ఒకసారి కలిపిద్దాం అని తీస్కొచ్చిన." అని చేప్తుండు నాన్నకు సంతోషంగా.

"వెరీ గుడ్. మంచి డెసిషన్." అని చెయ్యి కలిపిండు నాన్న.

"రమేష్ కొంచం అమెరికా ఒచ్చినంక నీకు ఫోన్ గిట్ల చెయ్యమంట. ఎమన్నా అవసరం ఉంటే చూస్కో బేటా. ఒకవేళ పైసలు అవసరం అయితే నువ్వు అక్కడ వీనికి ఇయ్యొచ్చు,  నేను ఇక్కడ రెడ్డిసాబ్ కి ఇచ్చేస్తా."

"సరే అంకుల్ నో ప్రాబ్లం." అని అంకుల్ తో అని,  "ఏ యూనివర్సిటీకి ఒస్తున్నావ్?" అని రాజేష్ ని అడిగిన.

“టెక్సాస్ అన్నయ్యా.” నసిగిండు మెల్లగా.

“ఎక్కడ టెక్సాస్ లో?”

“Texas A&M అన్నయ్యా... kingsville.”

“ఓహ్.. ఓకే.. మీ ఫ్రెండ్స్ ఎవరన్నా ఉన్నారా అక్కడ.”

“వాళ్ళు ఆల్రెడీ వెళ్ళిపోయారు అన్నయ్యా.. నేనొక్కడినే వెళ్ళాలి ఇప్పుడు. అదే కొంచం భయంగా ఉంది.”

“ఉన్నారు కదా అక్కడ వెళ్ళగానే చూసుకోడానికి. అదే ముఖ్యం. వెళ్ళడం ఏముంది. ఇక్కడ ఎక్కితే అక్కడ దిగుతవు.

మొహమాటంగా నవ్వి ఊరుకున్నడు రాజేష్.

“అదే భయం అయితుంది. వీడేమో అమాయకుని లెక్క ఉంటడు. ఎట్ల పోతడో, ఎట్ల ఉంటడో ఒక్కడు.” మల్ల అదే అంటుండు అంకుల్.

“ఏం కాదులెండి. అందరూ పోతలేరా. ఒస్తలేరా. మా ఓడు కూడా అట్లనే ఉండేటోడు. ఏం కాదు.” నాన్న అంకుల్ కి ధైర్యం చెప్పిండో లేక నేను కూడా రాజేష్ లాగ అని చెప్పిండో అర్థం కాలే నాకు.

- * *

ఒక రెండు మూడు సంవత్సరాలు రాజేష్ గురించి వినలేదు నేను. నా MS అయిపోయింది. కొత్త జాబ్, ఆ హడావుడిలో ఒక సంవత్సరం ఇండియాకి రాలేదు. ఆ తరవాత ఒచ్చినప్పుడు కూడా పట్టించుకోలేదు. కాని పొయినసారి ఒచ్చినప్పుడు కలిసిండే.

ఒకసారి నేనింట్ల ఉన్నప్పుడు అంకుల్ నాన్నకి ఫోన్ చేశిండు. ఒకసారి రమ్మన్నడు ఇంటికి అని చెప్పిండు నాన్న. సరే నాన్న నన్ను కూడా రమ్మంటే పోయిన.

పొయ్యేసరికి అంకుల్, ఆంటీ, రాజేష్ ఉన్నరు. ఒక్క నిమిషం నేను రాజేష్ ని గుర్తుపట్టలే. అసలు నేను చూసిన రాజేషేనా వీడు అనిపించింది. అప్పటికి ఇప్పటికి సంబంధమే లేదు. బ్రాండెడ్ బట్టలు, చాలా కాస్ట్లీవి. సరే బాగా సంపదిస్తుండు అనుక్కున్నా. కాని ఇంతకుముందు లేని స్టైల్ ఇప్పుడు ఒచ్చింది. బిడియం, అమాయకత్వం కలిపిన బాడీ లాంగ్వేజ్ ఇప్పుడు లేదు. చాలా కాంఫిడెంట్ గా ఉన్నాడు. రాముడు మంచి

బాలుడు లాంటి జుట్టు కూడా స్పైక్స్ ఒచ్చి మారిపోయింది. చెవికి పోగొచ్చింది. ఇట్ల చెప్పుకుంటే ఇంకా ఉన్నాయి. అమెరికా నిజంగానే మనుషులని మార్చేస్తుంది అంటే ఏమో అనుకున్నా. నా సంగతి ఎక్కడేసిన గొంగళి అక్కడే టైపులో ఉంది. వీడు చూడు ఎట్ల మారిపోయిండో. నిజం చెప్పాల్నంటే కొంచం అసూయ కూడా ఒచ్చింది.

ఇది ఆలోచించుకుంట నేను గమనించనిది ఏందంటే అందరు సీరియస్ గా ఉన్నరు. మమ్మల్ని కూర్చోమని, అది ఇది అన్నరు కాని ఒక్కరి మొఖంల నవ్వు లేదు. అప్పుడే ఏదో గొడవ అయినట్టు ఉంది.

“రెడ్డిసాబ్. మీరంటే గౌరవం మాకు. ఇంతకు ముందు కూడా వీణ్ణి పంపించేటప్పుడు మిమ్మల్నే అడిగినుండే. ఇప్పుడు మల్ల ఏం చెయ్యాల్నో అర్థం కాని స్థితి ఒచ్చింది.” అని ఆపిండు.

“చెప్పు మారుతి. నాకు అర్థం అయింది చెప్తా. అంత పెద్ద కష్టం ఏమొచ్చింది.”

“మా రాజుని చూశిన్రా... ఎట్ల మారిపోయిండో. అప్పుడు అమెరికా పంపించినం. ఇన్నేండ్లకు ఒచ్చిండు. ఇప్పుడు కూడా ఒక్కడే ఒచ్చిండు అనుకుంటున్రా? ఎవరినో తీస్కొచ్చిండు. దాన్నే పెళ్ళి చేస్కుంటడంట. ఇప్పుడేం చెయ్యాలే. వీని చెల్లె పెండ్లికున్నది. దాన్నేవాడు చేసుకుంటడు. ఆ సోయి ఎమన్న ఉందా వీనికి?”

“అవునా. హ్మ్.. ఒక్క మాట చెప్తా ఇను మారుతి. ఇయ్యాల రేపు ఇవన్ని ఎవరు పట్టించుకుంటలేరు. పిల్లలకి ఇష్టం అయితే మనం ఏం చేస్తం. వాళ్ళు ఒద్దు అంటే బలవంతంగా చేస్తామా? చేసినా వాళ్ళు సంతోషంగా ఉంటరా?”

“అది కాదు రెడ్డి సాబ్. తెల్ల పిల్లని తీస్కొచ్చిండు.”

“అవునా. ఇండియాకి ఒచ్చిందా ఇప్పుడు?” ఆత్రుతలో ఆదిగేశ్న. తరవాత నాకే సిగ్గేసింది.

“అవును. ఆమెని హోటల్ల పెట్టి, వీడు కూడా హోటల్లనే దిగి మేము బతికున్నమా అని చూడనీకే ఇక్కడికి ఒచ్చిండు.”

“అయ్యో. అదేందయ్యా ఇంత దూరం ఒచ్చి. హోటల్ల దిగుడు. మీ అమ్మనాన్నకి ఎట్లుంటది.” అడిగిండు నాన్న.

“టెర్రీ కూడా ఉంది కదా అంకుల్. తను ఎలా ఒస్తుంది ఇక్కడికి.” రాజేష్ భాష కూడా మారిపోయింది. సినిమా వాళ్ళ లాగ నంగి నంగి తెలుగు మాట్లాడుతున్నాడు. నాకొక్క నిమిషం నవ్వొచ్చింది.

“అదొచ్చినా. నేను రానియ్యను దాన్ని ఇంట్లకి. ఏదేమయినా కాని.” ఆంటీ కూడా కలిసింది అంకుల్ తోటి.

“ఇది సంగతి రెడ్డిసాబ్. వీని చెల్లె పెళ్ళి ఉన్నది. వీడు తెల్ల పిల్లని తెస్తే రేపు దాన్ని ఎవరు చేస్కుంటరు?”

“ఆ మాటలే మాట్లాడొద్దు అని చెప్పిన డాడీ నేను నీకు. ఈ మధ్య అంతా మారిపోయింది. ఎవ్వరూ పట్టించుకోవట్లే ఇవన్ని. నా పెళ్ళి వేరు, చెల్లి పెళ్ళి వేరు. అయినా నేనిప్పుడే చేసుకోవట్లేదు పెళ్ళి. ఇంకా టైం కావాలి.” అరిచిండు రాజేష్.

“మరి చేస్కోకపోతే ఎందుకు తెచ్చినవ్ ఆ అమ్మాయిని?”

“మీరిట్ల మాట్లాడ్తరని నాకేం తెలుసు. ఆ అమ్మాయిని మీకు చూపించాలనుకున్నా. మనింట్లో మంచిగా ట్రీట్ చేస్తరు అనుకున్నా.  మీ అందరి గురించి చాలా గొప్పగా చెప్పిన టెర్రీకి.”

ఒక నిమిషం సైలెన్స్. ఎవరికి ఏం మాట్లాడాల్నో అర్ధం కాలే.

“జరిగేది జరిగిపోయింది. రాజేష్ అన్నట్టు ఆ అమ్మాయిని ఇంట్లోకి రానివ్వండి. ఆప్యాయంగా మాట్లాడండి. ఆడ పిల్ల ఎవరయినా ఆడ పిల్లే కదా. మీ అబ్బాయి కోరుకున్నంక మీకు కోడలు కాకుండా పోతుందా?” సర్ది చెప్పిండు నాన్న. మా నాన్నలో లవ్ మ్యారేజ్ కి ఇంత మంచి అభిప్రాయం ఉందని తెలియదు నాకు. ముందే తెలిస్తే బాగుండే అనిపించింది.

“నాకు ఏం కష్టం లేదండి. వీడెవర్ని చేసుకున్నా. కాని వీడి చెల్లె గురించి ఏమన్నా ఆలోచించిండా? నేను దాని కట్నం కోసం ఏం పెద్దగా కూడబెట్టలే. ఇప్పుడు వీడిట్ల చేస్తే రేపు దానికి మంచి సంబంధం రాకపోతే ఎట్ల? అసలు వీడికోసం తీసుకున్న లోన్ కూడా ఇంకా మొత్తం కట్టాలే మేము.” అంకుల్ భయం నాకు కొంచం అర్ధం అయింది.

“అదేంది. రాజేష్ కి జాబ్ ఒచ్చి రెండు మూడు ఎండ్లాయే కదా. ఇంకా ఆ లోన్ తీర్చలేదా?”
“అది. కొంచం ఖర్చులు ఉండి మొత్తం తీర్చలేదు అంకుల్. బట్ ఈ ఇయర్ ఎండింగ్ వరకు మొత్తం అయిపోతది. అందుకే టెర్రీకి ఇష్టం ఉన్నా నేను పెళ్ళి  చేసుకోవట్లే ఇప్పుడే?” చెప్పిండు రాజేష్.

“మరింకేంది మారుతి. పిల్లోడు బాధ్యతగనే ఉన్నడు. అప్పు తీర్చినంకనే చేస్కుంటా అని అంటుండు. కావాల్నంటే చెల్లె పెళ్ళి అయ్యేవరకు ఆగమని చెప్పు. ఎవరికీ ఏం తెలవదు. తరవాత తెల్లమ్మాయిని చేస్కున్నా, ఎవరిని చేస్కున్నా ఎవరేం చేస్తరు?” నాన్న ఐడియా నాకు ఏదో చీటింగ్ లాగ అనిపించింది.

“ఏమో రెడ్డి సాబ్. దాన్ని చూడున్రి. ఇన్నేండ్లకి కొడుకు ఒస్తుండు అని ఇల్లంతా ఒక్కటి చేశింది. ఇప్పుడు దాని మొఖంల ఎమన్నా సంతోషం ఉన్నదా?” అని అంటీని చూశిండు.

“ఇంక ఇవన్ని నడుస్తనే ఉంటయి. పిల్లలు ఇష్టపడ్డంక కాదనలేం కదా. కాదన్నా, ఇప్పుడున్న కోపాలు తరవాత్తరవాత ఉండవు. మనమే సర్దుకుపోవాలి.”

అట్లనే కొంచం సేపు సర్దిచెప్పి అక్కడినుంచి బయల్దేరినం.

అప్పుడు ఒచ్చిన రాజేష్ అంతే మళ్ళి ఇన్నేండ్లయినా రాలేదు. అక్కడే పెళ్ళి చెస్కున్నడంట. అంకుల్ వాళ్ళని రమ్మంటే వెళ్ళు పోలేదంట.

“ఎందుకు?” అమాయకత్వంతో అడిగిందో అర్థం చేసుకొని అడిగిందో తెలియదు కాని అడిగింది ప్రియాంక.

“ఏమో వీళ్ళ కష్టాలు వీళ్ళవి. ఆ లోన్ సంగతి నాకు తెలియదు కాని చెల్లెలు పెళ్ళికి మాత్రం ఏం ఇవ్వలేదు రాజేష్ అని చెప్పిండు నాన్న. నో అప్పు చేసి కూతురి పెళ్ళి చేసింరు. వీసా గొడవలు ఉన్నాయి కాబట్టి దానికి రాలేకపోయిండంట రాజేష్. ఈ లొల్లిలో అమెరికా అంటే టికెట్స్  ఖర్చు రాజేష్ పెట్టుకున్నా వీళ్ళకి కూడా ఖర్చు అవుతది కదా ఎంతో కొంత. అది కష్టం అనుకున్నారేమో.”

“తెల్ల పిల్లని కోడలుగా ఒప్పుకోలేకపోయారేమో..”

“ఏమో.. అది కూడా నిజం కావచ్చు. చెప్పలేం.”

• * *

మేము పొయ్యే రోజు ఇంటికొచ్చిండు అంకుల్. ఒక ప్యాకెట్ తెచ్చిండు.

“చెప్తే నేనే ఒచ్చి తీస్కునేటోడిని కదా అంకుల్. మీరెందుకు ఈ టైములో.” అన్న. అమెరికా ఫ్లైట్స్ అన్ని అర్ధరాత్రి పోతయి.

“అరే. ఏం కాదు. మీకెందుకు కష్టం. ఇది చిన్నదే. వాళ్ళ అమ్మ ఏమో పెట్టింది రాజేష్ కోసం. అడ్రస్ దీని పైననే ఉంది. రాజేష్ నే మీకు ఫోన్ చెయ్యమని చేప్తం. జెర అక్కడికి పొయినంక పోస్ట్ చెయ్యి. ఏమనుకోకు. సరేనా.” అని ఒక ప్యాకెట్ ఇచ్చిండు. ఒక కిలో దాక ఉంటదేమో.

"ఏం ఫరవాలేదు అంకుల్. నేను ఫోన్ చేస్తాలే రాజేష్ కి."

ఇచ్చేసి ఉండమన్నా పొద్దున్నే షాపు తియ్యాలి అని చెప్పి పోతుండు.

బయట స్కూటర్ కిక్ కొడ్తుంటే చూస్తున్న.

అప్పుడే ప్రియాంక ఒచ్చింది.

"ఏంది. పది సార్లు కిక్ కొట్టినా స్టార్ట్ కాదు. అదే స్కూటర్ ఏం మారలే. అదే చూస్తున్నావా?" అని నవ్వింది.

"స్కూటర్ మారలే. అంకుల్ మారిండు. ఇంతకుముందు ఆగకుండా పది సార్లు కిక్ కొడుతుండే. ఇప్పుడు మధ్యల ఆయసపడి ఆగుతుండు."